


RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 161 | సంపాదకులు : గొంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | శుక్రవారం - 31 - జూలై - 2026 | వెల రూ. 5 /-

# '2034 వరకు నేనే సీఎం'..

## - ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ

- టీచర్ల సమస్యలు తన బాధ్యతన్న సీఎం
- విద్యార్థుల కోసం పోరాడాలని పిలుపు
- 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించామని వ్యాఖ్య
- ఆర్నెల్లకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం
- ప్రతి నెల ఒకటో తేదీన జీతాల హామీ



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్న ప్రతిసారీ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయితే వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. ఇకపై ఉపాధ్యాయ సంఘాలు తమ వ్యక్తిగత సమస్యల కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తాను ఒక్కటే చెబుతున్నానని రేవంత్ అన్నారు. "మీ సమస్యలు నాకు వదిలేయండి. మీరు అడగకముందే వాటిని పరిష్కరిస్తాను. ప్రమోషన్లు, బదిలీలు కూడా మీ ఇంటి వద్దకే పంపించాం. ఇకపై మీకోసం కాదు.. విద్యార్థుల సమస్యల కోసం నాతో కొట్లాడండి" అని సూచించారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని వ్యాఖ్యానించిన రేవంత్ రెడ్డి, ఆ లోపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పూర్తి బాధ్యత వహిస్తానన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 55 రోజుల్లో 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని గుర్తు చేశారు. ఇలాంటి నియామకాలు గతంలో ఎప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులదేనని, అందుకే వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో తెలంగాణ విద్యాశాఖను ప్రపంచ దేశాలు ఆదర్శంగా చూసే స్థాయికి తీసుకెళ్లాలని రేవంత్ పిలుపునిచ్చారు. పంచవర్ష ప్రణాళిక తరహాలో ఉపాధ్యాయ సంఘాలు ప్రతిజ్ఞ చేసి పని చేయాలనీ కోరారు. అలాంటి కృషి చేస్తే విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని అన్నారు. దేశానికి విద్య, వైద్య రంగాల్లో తెలంగాణే నాయకత్వం ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నేరుగా చర్చిస్తానని సీఎం హామీ ఇచ్చారు. వారి సమస్యల పరిష్కారానికి క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఒకటో తేదీన ఉద్యోగుల జీతాలు సమయానికి పడేవి కాదని, ఇప్పుడు మాత్రం అడగకుండానే ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అదే రోజు వేతనాలు చెల్లిస్తున్నామని వెల్లడించారు.

## పేపర్ లీక్ ముఠాలను ఇక సహించేది లేదు..

### - ఇన్‌స్టాలో మోదీ కొత్త సందేశం



- పేపర్ లీకులను అరికట్టే సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం
- స్వాగతించిన ప్రధాని నరేంద్ర మోదీ
- పేపర్ లీక్ మాఫియాపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టీకరణ
- పరీక్షల వ్యవస్థను పటిష్ఠం చేయడానికి సంస్కరణలు చేపట్టినట్లు వెల్లడి
- విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ

2

## పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం.. రాజ్యసభలోనూ ఆమోదం పొందిన బిల్లు



- రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే అమల్లోకి చట్టం
- గరిష్ఠంగా రూ.10 కోట్ల జరిమానా
- జైలు శిక్ష, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ
- ఎన్‌టీఏపై ప్రతిపక్షం విమర్శలు
- సమగ్ర సంస్కరణలపై కొనసాగుతున్న డిమాండ్

2

## తెలంగాణ జలాశయాలకు పోటెత్తుతున్న వరద..



»2

## పంచాయతీ నిధుల పక్కదారిపై పూర్తి విచారణ జరపాలి

### - కేంద్ర, రాష్ట్ర మంత్రులకు బండి సంజయ్ లేఖ



- పంచాయతీలకు కేంద్రం విడుదల చేస్తున్న నిధులను పక్కదారి పట్టిస్తున్నారన్న బండి సంజయ్
- నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలని సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆరోపణ
- నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలన్న బండి సంజయ్

»2

## బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్.. టీజీఎస్‌ఆర్టీసీ సరికొత్త సేవలు..

### - తక్కువ ఛార్జీలతో ఎలక్ట్రిక్ ఆటోలు

- ప్రయాణికుల కోసం 'ఫస్ట్ మైల్, లాస్ట్ మైల్' కనెక్టివిటీకి ఆర్టీసీ శ్రీకారం
- ఇంటి నుంచి బస్టాప్‌కు, బస్టాప్ నుంచి గమ్యానికి ఈ-ఆటో సేవలు
- బస్ టికెట్‌తో కలిపి ఆటో రైడ్ బుక్ చేసుకునే ప్రత్యేక సౌకర్యం
- మొదట హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా, తర్వాత ఇతర నగరాలకు విస్తరణ



»2




**నర్సంపేట మాజీ ఎమ్మెల్యే శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి గారు పరమపదించారు**

ప్రజల సేవకు అంకితభావంతో పనిచేసిన ఆయన, నిబద్ధతతో, వినయంతో తన రాజకీయ జీవితం మొత్తం ప్రజల అభ్యున్నతికి కృషి చేశారు. నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. ఆయన అకస్మాత్తు మరణం రాజకీయ వర్గాలకు, ప్రజలకు తీరని లోటు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాము.

## తెలంగాణలో కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్..

### - వేలాదిగా పేరుకుపోయిన దరఖాస్తులు

- తెలంగాణలో పేరుకుపోతున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ దరఖాస్తులు
- రెండు రోజుల్లో జారీ చేయాలన్న నిబంధన అమలు కాని వైనం
- రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో 50,000కు పైగా దరఖాస్తులు

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ (ఎఫ్ఆర్‌సీ) జారీ ప్రక్రియలో జాప్యం నెలకొంది. దరఖాస్తు చేసుకున్న రెండు పనిదినాల్లోనే ధ్రువీకరణ పత్రం అందజేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో గడువు పాటించకపోవడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో పడ్డాయి. ఈ పథకం ప్రారంభమైన జులై 27 నుంచి బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా 50 వేలకు పైగా దరఖాస్తులు అందాయి. తొలిరోజే దరఖాస్తు చేసుకున్న వారికి సైతం ఇప్పటివరకు సర్టిఫికెట్లు అందకపోవడంతో, వారు నిత్యం మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఫలితంగా దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత నెల 25న విడుదల చేసిన జీవో 172 నిబంధనల ప్రకారం, దరఖాస్తు అందిన రెండు పనిదినాల్లోగా సంబంధిత తహశీల్దార్లు వాటిని పరిశీలించి సర్టిఫికెట్లను జారీ చేయాలి. అయితే, పలు ప్రాంతాల్లో ఈ నిబంధన అమలు కావడం లేదు.

**సర్టిఫికెట్ జారీ ప్రక్రియ ఇదే**

పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న రేషన్ కార్డుల సమాచారం ఆధారంగా ప్రభుత్వం 'తెలంగాణ ఫ్యామిలీ రిజిస్టర్'ను సిద్ధం చేసింది. పౌరులు మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోగానే, ఆ దరఖాస్తు నేరుగా సంబంధిత తహశీల్దార్ లాగిన్‌లోకి వెళ్తుంది. అక్కడ తహశీల్దార్ ఆ వివరాలను రేషన్ కార్డు డేటాతో సరిపోల్చి చూసి, అంతా సక్రమంగా ఉంటే డిజిటల్ సంతకంతో ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయాలి. కానీ, తహశీల్దార్ల స్థాయిలో ఈ ప్రక్రియ మందకొడిగా సాగుతుండటంతో దరఖాస్తుల సంఖ్య భారీగా పేరుకుపోతోంది.

## తెలంగాణ జలాశయాలకు
# పోటెత్తుతున్న వరద..

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధాన జలాశయాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతుండటంతో పాటు జూరాల, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టుల నీటిమట్టాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జలపాతాలు, నదీ తీర ప్రాంతాల వద్ద పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్.. టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సేవలు..
### - తక్కువ ఛార్జీలతో ఎలక్ట్రిక్ ఆటోలు

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా టీజీఎస్ఆర్టీసీ మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. బస్సు ప్రయాణికులకు ఇంటి నుంచి బస్ స్టాప్ వరకు, బస్సు దిగాక గమ్యస్థానం వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణాన్ని కొనసాగించేందుకు 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్' కనెక్టివిటీ విధానాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ కంపెనీలతో ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు కొలిక్కి వచ్చిన వెంటనే ఈ-ఆటోలు రోడ్డెక్కనున్నాయి. ఈ కొత్త విధానంలో ప్రయాణికులు తమ బస్ టికెట్‌ను బుక్ చేసుకునే సమయంలోనే అదనంగా ఆటో రైడ్‌ను కూడా ఒకేసారి బుక్ చేసుకునేలా ప్రత్యేక సౌకర్యం కల్పించనున్నారు. దీని ద్వారా ప్రయాణికులను వారి నివాసం నుంచి సమీప బస్ పాయింట్‌కు, అలాగే బస్సు దిగిన తర్వాత అక్కడి నుంచి వారి చివరి గమ్యస్థానానికి ఈ-ఆటోలు సురక్షితంగా చేరవేస్తాయి. ఫలితంగా ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవడంతో పాటు బస్టాప్‌లకు చేరుకోవడానికి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లడానికి పడే ప్రయాసలు తప్పుతాయి. ఈ ఎలక్ట్రిక్ ఆటో సేవలను ప్రయోగాత్మకంగా తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ లభించే స్పందన, ఫలితాల ఆధారంగా రెండో దశలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు దశలవారీగా విస్తరించాలని యోచిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం నగరంలో అధిక ఛార్జీలతో నడుస్తున్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ రైడ్ హెయిలింగ్ యాప్‌ల కన్నా గణనీయంగా తక్కువ ఛార్జీలతో ఈ సేవలను అందించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ నిర్ణయం వల్ల హైదరాబాద్ శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, ఉప్పల్, మియాపూర్, పటాన్‌చెరు, శంషాబాద్, ఘట్‌కేసర్ వంటి కనెక్టివిటీ సమస్యలున్న ప్రాంతాల ప్రజలకు గొప్ప ఊరట లభించనుంది. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆర్టీసీ ఈ-ఆటోల నిర్ణయం ఒక మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రియాంక 'గోమూత్ర నిపుణుడు' వ్యాఖ్య..
### - భగ్గుమన్న 200 మంది విద్యావేత్తలు

**'గోమూత్ర నిపుణుడు' అనడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విద్యావేత్తలు**

**215 మంది సంతకాలతో బహిరంగ లేఖ విడుదల**

**ఇది శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీయడమేనని లేఖలో ఆందోళన**



**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా ఉన్న విద్యావేత్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. కామకోటిని ఉద్దేశించి ఆమె "గోమూత్ర నిపుణుడు" అని వ్యాఖ్యానించడాన్ని తప్పుబడుతూ 200 మందికి పైగా ప్రముఖులు ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. మంగళవారం లోక్‌సభలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు, 2026'పై జరిగిన చర్చలో ప్రియాంక గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరీక్షల సంస్కరణల నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ సభ్యుల నియామకాన్ని ప్రశ్నిస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తన ప్రసంగంలో ఆమె ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించనప్పటికీ, ఆ విమర్శలు కమిటీ సభ్యుడైన ప్రొఫెసర్ కామకోటిని ఉద్దేశించినవేనని స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో 215 మంది వైస్ ఛాన్సలర్లు, మాజీ వైస్ ఛాన్సలర్లు, విద్యావేత్తలు సంతకాలు చేసిన లేఖలో ప్రియాంక తీరును తీవ్రంగా ఖండించారు. రాజకీయ విమర్శల కోసం ఒక ప్రముఖ శాస్త్రవేత్తను కించపరిచేలా మాట్లాడటం సరికాదని, ఇటువంటి ధోరణి రాజ్యాంగం నిర్దేశించిన శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కామకోటి ఐఐటీ మద్రాస్‌లోనే పీహెచ్‌డీ పూర్తి చేశారని, 150కి పైగా పరిశోధన పత్రాలను సమర్పించారని, డీఆర్‌డీఓ అకడమిక్ ఎక్సలెన్స్ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలను అందుకున్నారని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. భారత్ తొలి ఇండస్ట్రీ-గ్రేడ్ మైక్రోప్రాసెసర్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన గొప్ప సాంకేతిక నిపుణుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అనుచితమని వారు హితవు పలికారు. పార్లమెంట్ చర్చలు గౌరవప్రదంగా, హుందాగా జరగాలని వారు సూచించారు.

# పేపర్ లీక్ ముఠాలను ఇక సహించేది లేదు.. ఇన్‌స్టాలో మోదీ కొత్త సందేశం

**మొదటిపేజీ తరువాయి..** పబ్లిక్ పరీక్షల్లో పేపర్ లీకులను అరికట్టే సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేసిన ఆయన.. పేపర్ లీక్ మాఫియాపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలన్నీ పేపర్ లీకుల సమస్యను ఎదుర్కొన్నాయని మోదీ గుర్తు చేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగాన్ని పెంచడం, వేగవంతమైన వ్యవస్థలను అమలు చేయడం, పారదర్శకతను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొత్త చట్టంతో పేపర్ లీక్ ముఠాలపై మరిన్ని కఠిన చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం..
## రాజ్యసభలోనూ ఆమోదం పొందిన బిల్లు

**మొదటిపేజీ తరువాయి..** దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, పేపర్ లీక్‌లను అరికట్టడం లక్ష్యంగా తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026కు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లుకు గురువారం రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రపతి అంగీకారం లభించగానే ఇది చట్టంగా అమల్లోకి రానుంది. కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. చర్చ సందర్భంగా ప్రభుత్వం, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడీ వాదనలు జరిగాయి. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికే ఈ సవరణలు తీసుకొచ్చామని ప్రభుత్వం స్పష్టం చేసింది. భారీ జరిమానాలు, ప్రత్యేక కోర్టులు, వేగవంతమైన విచారణలతో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపింది. ఈ సవరణల ప్రకారం పేపర్ లీక్‌లకు పాల్పడిన వారిపై గరిష్ఠంగా రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. జైలు శిక్షతో పాటు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ పూర్తి చేసే నిబంధనలను కూడా చేర్చారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడే ముఠాలపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు ఈ మార్పులు ఉపయోగపడతాయని ప్రభుత్వం పేర్కొంది. 2024లో తీసుకొచ్చిన చట్టం అమలులో వచ్చిన అనుభవాల ఆధారంగానే ఈ సవరణలు రూపొందించినట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. ఆ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పారు. పేపర్ లీక్‌ల కారణంగా ఆత్మహత్యల సంఖ్య కూడా తగ్గిందని సభకు వివరించారు. అయితే ప్రతిపక్షం మాత్రం బిల్లుపై విమర్శలు గుప్పించింది. కేవలం శిక్షలు పెంచడం సరిపోదని, పరీక్షల నిర్వహణ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అవసరమని డిమాండ్ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపైనా ప్రశ్నలు లేవనెత్తింది. మరోవైపు విద్యార్థుల ప్రయోజనాల కోసం కేంద్రం వేగంగా చర్యలు తీసుకుందని అధికార పక్షం పేర్కొంది. మాజీ విద్యాశాఖ మంత్రి రాజీనామా, నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించడం వంటి చర్యలను ప్రస్తావించింది.

# పంచాయతీ నిధుల పక్కదారిపై పూర్తి విచారణ జరపాలి
### - కేంద్ర, రాష్ట్ర మంత్రులకు బండి సంజయ్ లేఖ

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం విడుదల చేస్తున్న నిధుల వినియోగంలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని, మార్గదర్శకాలకు విరుద్ధంగా నిధులను పక్కదారి పట్టిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్ర నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలంటూ పంచాయతీ అధికారులపై, సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయి నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కలకు బండి సంజయ్ లేఖలు రాశారు. సర్పంచులు తమకు ఎదురవుతున్న ఒత్తిళ్లపై ఆధారాలతో సహా ఇచ్చిన ఫిర్యాదులను లేఖలకు జత చేసినట్లు ఆయన తెలిపారు. "గ్రామీణ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థే మూలస్తంభం. ఇక్కడ నిధులు పక్కదారి పడితే గ్రామాల అభివృద్ధి స్తంభించిపోవడమే కాకుండా, పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుంది" అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు తక్షణమే జోక్యం చేసుకుని, ఆధారాల ఆధారంగా పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# బస్ డ్రైవర్ ఇంట్లో నోట్ల గుట్టలు.. - లెక్కించలేక మొరాయించిన మిషన్లు!

**నేటి శుభోదయ, పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్‌లో భారీగా నగదు, బంగారం పట్టుబడటం సంచలనం సృష్టిస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేతకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తి బంధువు ఇంట్లో ఏకంగా రూ. 28 కోట్ల నగదు, రూ. 21 కోట్ల విలువైన 15 కిలోల బంగారం బయటపడింది. బీర్భూమ్ జిల్లాలో జరిగిన ఈ ఘటనలో నోట్ల కట్టలను లెక్కించేందుకు పోలీసులు తీసుకొచ్చిన ఐదు...పశ్చిమ బెంగాల్‌లో భారీగా నగదు, బంగారం పట్టుబడటం సంచలనం సృష్టిస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేతకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తి బంధువు ఇంట్లో ఏకంగా రూ. 28 కోట్ల నగదు, రూ. 21 కోట్ల విలువైన 15 కిలోల బంగారం బయటపడింది. బీర్భూమ్ జిల్లాలో జరిగిన ఈ ఘటనలో నోట్ల కట్టలను



లెక్కించేందుకు పోలీసులు తీసుకొచ్చిన ఐదు కౌంటింగ్ మిషన్లు కూడా మొరాయించాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. వివరాల్లోకి వెళితే.. బీర్భూమ్‌కు చెందిన మినార్ మండల్ అనే బస్ డ్రైవర్ ఇంట్లో నిన్న రాత్రి పోలీసులు దాడులు ప్రారంభించారు. ఉదయానికి స్వాధీనం చేసుకున్న నగదు మొత్తం రూ. 28 కోట్లకు చేరింది. మినార్ మండల్.. టీఎంసీ మాజీ నేత అనుబ్రత మండల్‌కు సన్నిహితుడైన వ్యాపారి తులు మండల్‌కు బంధువు. ఇటీవల తులు మండల్, టీఎంసీ రెబల్ వర్గంలో చేరారు. పోలీసులు మినార్ మండల్‌ను అరెస్ట్ చేయగా, విచారణలో కీలక విషయాలు వెల్లడించాడు. పట్టుబడిన డబ్బు, బంగారం అంతా తులు మండల్, అతని 'అక్రమ సిండికేట్'కు చెందినదని అంగీకరించాడు. ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి స్పందించారు. ఇసుక మాఫియాపై ఇది తమ ప్రభుత్వ ఉక్కుపాదమని, అవినీతిపై జీరో-టాలరెన్స్ విధానంతో ముందుకెళ్తామని ఆయన 'ఎక్స్' వేదికగా తెలిపారు. ప్రజాధనాన్ని దోచుకున్న వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. ఈ దాడులు నిర్వహించిన బీర్భూమ్ పోలీసులను ఆయన అభినందించారు.

# ఒరిజినల్ డాక్యుమెంట్లు గల్లంతు.. ఎస్బీఐకి వినియోగదారుల కమిషన్ భారీ షాక్

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ఖాతాదారుడికి చెందిన కీలకమైన ఆస్తి పత్రాలను పోగొట్టిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)పై రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. బ్యాంకు నిర్లక్ష్యం కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురైన బాధితుడికి రూ. 3 లక్షల నష్టపరిహారంతో పాటు, వ్యాజ్యం ఖర్చుల నిమిత్తం మరో రూ. 20,000 చెల్లించాలని ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది. ఇబ్రహీంపట్నం పరిధిలోని బొంగులూరుకు చెందిన బి. వెంకటేశం, ఎస్బీఐ ఆదిభట్ల బ్రాంచ్‌లో రూ. 5 లక్షల గృహ రుణం తీసుకున్నారు. ఈ రుణానికి అదనపు హామీగా తన బంధువు అంజయ్యకు చెందిన 194 చదరపు గజాల ప్లాట్‌కు సంబంధించిన ఒరిజినల్ సేల్ డీడ్, ఇతర లింక్ డాక్యుమెంట్లను బ్యాంకులో సమర్పించారు. మార్చి 2022లో వెంకటేశం





రుణం మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించి, బ్యాంకు నుంచి నో-డ్యూస్ సర్టిఫికెట్ కూడా పొందారు. అనంతరం తన పత్రాలను తిరిగి ఇవ్వాలని ఆయన బ్యాంకును కోరగా, అధికారులు తొలుత పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. సెంట్రలైజేషన్ ప్రక్రియ జరుగుతోందని, 15 రోజుల్లో ఇస్తామని కాలయాపన చేశారు. ఆ తర్వాత అసలు పత్రాలు కనిపించడం లేదని బ్యాంకు వర్గాలు సమాధానం ఇవ్వడంతో బాధితుడు దిగ్భ్రాంతికి గురయ్యారు. దాదాపు రెండేళ్లపాటు బ్యాంకు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడం, బ్యాంకు యాజమాన్యం కేవలం ధ్రువీకృత నకళ్లు (సర్టిఫైడ్ కాపీలు) మాత్రమే ఇవ్వడంతో ఆయన న్యాయం కోసం వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ కేసు విచారణ సందర్భంగా, తమ వైపు సేవల లోపం లేదని, పత్రాల అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, ప్రత్యామ్నాయ పత్రాల కోసం పత్రికా ప్రకటన కూడా ఇచ్చామని ఎస్బీఐ వాదించింది. అయితే, బ్యాంకు వాదనలను కమిషన్ తోసిపుచ్చింది. రుణం వెంకటేశం పేరు మీద ఉందని, పత్రాల భద్రతలో బ్యాంకు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంటూ, బాధితుడికి తగిన నష్టపరిహారం చెల్లించాలని ఎస్బీఐని ఆదేశించింది.

## ఆగస్టు 5, 6, 7 తేదీలలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి -సహారా ఇండియా బాధితుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి బాలయ్య

**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, జులై 30, నేటి శుభోదయ :**
ధర్పల్లి మండల కేంద్రం లో సహారా ఇండియా బాధితుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి బాలయ్య మాట్లాడుతూ దేశంలో సహారా మోసానికి బలైన 13 కోట్ల ఖాతాదారులు 10 లక్షల మంది ఏజెంట్ల డబ్బులు సహారా కంపెనీలో దాదాపు 3 లక్షల కోట్ల రూపాయలు పైగా కంపెనీ ఎగనామం పెట్టింది. పొదుపు చేసిన వారంతా పేద మధ్యతరగతి కుటుంబాలకు సంబంధించిన ప్రజల డబ్బు కంపెనీ ఎగనామం పెట్టడంతో ఖాతాదారుల పరిస్థితి కుర్ది లో పడ్డ ఎలుక లాగా దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు భవిష్యత్తులో పిల్లల పెండ్లి లకు చదువులకు గృహ నిర్మాణాలకు వృద్ధాప్యంలో పనికి వస్తాయని కొండంత ఆశతో నిత్యం కష్టపడి సహారా ఇండియాలో పొదుపు చేసుకుంటే ఏ అవసరానికి పనికి రాకుండా డబ్బులు పోయాయని 13 కోట్ల ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు కేంద్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాల క్రితం పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఖాతాదారునికి రూపాయితో సహా చెల్లిస్తామని హామీ ఇచ్చి ఎన్నికల అనంతరం సహారా ఖాతాదారులను మోసం చేశారు. 2023లో సహారా పోర్టల్ ద్వారా అప్లై చేసుకుంటే డబ్బులు చెల్లిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గారు మీడియా ముఖంగా ప్రకటిస్తే ఆన్లైన్ ద్వారా పోర్టల్ లో 6 కోట్ల మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 9500 కోట్ల రూపాయలను మాత్రమే చెల్లించి కాలయాపన కేంద్ర ప్రభుత్వం చేస్తుంది. ఎన్నో కుటుంబాలు చిన్న భిన్నమై రోడ్డున పడ్డాయి ఖాతాదారుల పరిస్థితి అన్నమో రామచంద్ర అంటూ తల కు చేతులు పెట్టుకొని డబ్బులు ఎప్పుడు వస్తాయని ఎదురుచూస్తున్నారు సుప్రీంకోర్టు లో 2011 సంవత్సరంలో సహారా సంస్థపై సెబి కేసు వేసి ఈనాటికీ 15 సంవత్సరాలు కాలం గడుస్తున్న 13 కోట్ల ఖాతాదారులకు న్యాయం చేయడంలో కోర్టులు పూర్తిగా విఫలమయ్యాయి సుప్రీంకోర్టుపై ఖాతాదారులకు పూర్తి విశ్వాసం కోల్పోయారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి 13 కోట్ల సహారా ఖాతాదారుల డబ్బులు చెల్లిస్తామని చెప్తున్నప్పటికీ ఈనాటికీ చెల్లించకుండా కాలయాపనం చేయడం వలన దాదాపు పదివేలకు పైగా ఖాతాదారులు సూసైడ్ చేసుకొని చనిపోయారు వందలాదిమంది ఏజెంట్లు చనిపోయారు ఉన్న ఏజెంట్లు మానసిక క్షోభ అనుభవిస్తున్నారు ఏజెంట్ల పై ఖాతాదారుల ఒత్తిడి పెరగడంతో ఏజెంట్లు గ్రామాలు వదిలి తలదాచుకుంటున్నారు ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం 13 కోట్ల ఖాతాదారులను దృష్టిలో పెట్టుకొని సహారా యొక్క ఆస్తుల్ని వేలం వేసి వచ్చిన డబ్బుల్ని ఖతాదారులకు అందే విధంగా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వం చొరవ తీసుకొని ఎడల లక్షలాది కుటుంబాల్లో చీకటి అలుముకుంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాము ఆగస్టు 5 6 7 తేదీలలో న్యూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని ఖాతాదారులు ఏజెంట్లు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం పై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయాలని కోరుతున్నాము



## బిఆర్ఎస్ పార్టీ గద్దెలు కూల్చుడు కాదు, కాంగ్రెస్ అహంకార గద్దె కూలడం ఖాయం

- మాజీ మంత్రి పువ్వాడకు వస్తున్న ప్రజాదరణ తట్టుకోలేక కాంగ్రెస్ కుట్రలు : ఖమ్మం బీఆర్ఎస్ నేతలు
- ఖమ్మంలో కూల్చివేతలే మంత్రి తుమ్మల ఎజెండా



**ఖమ్మం, జులై 30, నేటి శుభోదయ :**
బీఆర్ఎస్ జెండా గద్దెల జోలికొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, ఆ అహంకార గద్దె కూలడం ఖాయమని ఖమ్మం బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని 8వ డివిజన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రోద్బలంతో బీఆర్ఎస్ జెండా గద్దెను కూల్చివేసిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ నాయకులు పరిశీలించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఖమ్మం బీఆర్ఎస్ మాజీ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, సుడా మాజీ ఛైర్మెన్ బచ్చు విజయ్ కుమార్, బీరెడ్డి నాగచంద్రారెడ్డి లు మాట్లాడుతూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌కు ప్రజల నుంచి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులు రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఖమ్మం ప్రజల్లో పువ్వాడ అజయ్ కుమార్‌పై ఉన్న చెక్కుచెదరని అభిమానాన్ని చూసి మంత్రి తుమ్మల అసహనానికి గురవుతున్నారని, అందుకే ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్యలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అనుసరిస్తూ మంత్రి తుమ్మల బీఆర్ఎస్ జెండా గద్దెను కూల్చివేయించారని, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌పై రాజకీయ కక్షతో ఇటువంటి చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఖమ్మంలో కూల్చివేతలే మంత్రి తుమ్మల ఎజెండాగా మారాయని ఆరోపించారు. బీఆర్ఎస్ అనేది జెండా గద్దెలు కూల్చివేస్తే అంతరించిపోయే పార్టీ కాదని, పువ్వాడ అజయ్ కుమార్‌పై ప్రజలకు ఉన్న అభిమానం, బీఆర్ఎస్ పార్టీపై ఉన్న విశ్వాసం ఖమ్మం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉందని స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలతో పువ్వాడ నాయకత్వాన్ని, బీఆర్ఎస్ పార్టీని బలహీనపరచాలని భావించడం కాంగ్రెస్ నాయకుల రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు.ఖమ్మం నగరంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా విమర్శలు చేయడం తగదు అని తెలిపారు.

## ప్రీ-ప్రైమరీ పోస్టుల నియామకాల్లో అక్రమాలపై విచారణ జరిపించాలి : మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య



**ఖమ్మం, జులై 30, నేటి శుభోదయ :**
ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.ను గురువారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. ఇటీవల జిల్లాలో నిర్వహించిన ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల నియామక ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, బాధిత అభ్యర్థులతో కలిసి వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ఈ నియామకాలలో అర్హులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రక్రియలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. మొత్తం నియామక ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన అభ్యర్థులకే ప్రాధాన్యత ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.బాధిత అభ్యర్థులకు ధైర్యం చెప్తూ.. బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైతే ఈ అక్రమాలపై హైకోర్టును కూడా ఆశ్రయిస్తామని సండ్ర వెంకట వీరయ్య భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల, నగర పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, భాషబోయిన వీరన్న, నాయకులు బిచ్చాల తిరుమలరావు, బత్తుల మురళి, మరియు తదితర నాయకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## గణేశ్వరం పాఠశాలలో ప్రీస్కూల్ విద్యార్థులకు చాపల వితరణ



**ఖమ్మం, జులై 30, నేటి శుభోదయ :**
గురువారం పదవీ విరమణ చెందిన గోపాల్ రావు చే ప్రీ స్కూల్ విద్యార్థులకు వారు కూర్చోటానికి చాపలను ఇవ్వటం జరిగింది. ప్రభుత్వం ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో యూకేజీ పెట్టడం వల్ల ప్రభుత్వం పాఠశాలలో బలోపేతం కావడానికి అవకాశం ఉంది. ఎందుకంటే ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం కావాలంటే యూకేజీ ఎల్కేజీ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలలో నడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అర్థం అవుతోంది అని గోపాల్ రావు అనడం జరిగింది . ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ ఎస్కే రఫిక్ పాషా, ఎన్ వెంకటేశ్వరావు, మజ్హార్, ఏ విజయలక్ష్మి , పీస్ స్కూల్ ఇన్స్పెక్టర్ జ్యోతి, ఆయా ఏ అరుణ పిల్లలు పాల్గొన్నారు. ఎస్కే రఫిక్ పాషా హెడ్మాస్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రీస్కూల్ వల్ల పాఠశాల విద్యార్థులకు పెరుగుతుందని పాఠశాలకు మెరుగైన విద్యార్థినిలు ఎల్కేజీ కేజీ పెట్టడం మంచిదని దానికి గోపాల్ రావు వారికి కావాల్సిన పలకలు, చాపలను అందించడం కాకుండా వారికైనా వారికి అవసరమైన వాటిని సమకూర్చారని నేను వారి కోరుతున్నాను.

## ధర్పల్లి చెరువులోకి భారీగా చేరిన వరద నీరు : నిండిన జలకళతో రైతుల ఆనందం



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, జులై 30, నేటి శుభోదయ :**
ధర్పల్లి మండలంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా స్థానిక ఊర చెరువులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మాట కాలువ ద్వారా నీటి ప్రవాహం నిరంతరాయంగా చెరువులోకి రావడంతో చెరువు వేగంగా నిండుతూ సంపూర్ణ జలకళను సంతరించుకుంది.ఈసారి కురిసిన వర్షాలతో పంటలకు విస్తారంగా నీరు అందుతుందని, భూగర్భ జలాలు పెరుగుతాయని భావిస్తూ మండల గ్రామానికి చెందిన రైతులు మరియు గ్రామస్థులు తీవ్ర ఆనందం వ్యక్తం చేస్తున్నారు.కాగా, చెరువులోకి వచ్చే నీటి ప్రవాహాన్ని మరియు మాట కాలువ పరిస్థితిని VDC ఛైర్మన్ ఆర్మూర్ రంజిత్ మరియు గంగా కుమార్ లు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో నీటి వృథా కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సీనియర్ నాయకులు సుంకేట సాయన్న అకాల మరణం

- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎంఆర్పిఎస్ నాయకులు





**నిజామాబాద్ రూరల్ డిచ్ పల్లి, జులై 30, నేటి శుభోదయ :**
మాదిగ హక్కుల పోరాటంలో, ఎమ్మార్పీఎస్ (MRPS) ఉద్యమంలో గత 15 స ంవ త ్సరాలుగా నిర ంత ర ం శ్రమిస్తూ, చురుకైన పాత్ర పోషించిన మిట్టపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు సుంకేట సాయన్న అకాల మరణం చెందడం పట్ల ఎమ్మార్పీఎస్ సంఘం మరియు గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు.సుంకేట సాయన్న గారు గత 15 ఏళ్లుగా మాదిగ దండోరా ఎమ్మార్పీఎస్ భావజాలాన్ని నమ్ముకుని, ఎస్సీ వర్గీకరణ సాధన ఉద్యమంలో మరియు సమాజంలో పీడిత వర్గాల హక్కుల కోసం జరిగిన అనేక పోరాటాలలో కీలక పాత్ర పోషించారు. ఆయన మరణం ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మరియు మిట్టపల్లి గ్రామానికి తీరని లోటు అని స్థానిక నాయకులు, కార్యకర్తలు కొనియాడారు.సాయన్న భౌతికకాయాన్ని దర్శించి, ఆయన పై MRPS జెండాను ఉంచి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ఎమ్మార్పీఎస్ నాయకులు, శ్రేణులు తమ తీవ్ర సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో స్థానికఎమ్ ఆర్ పి ఎస్ (MRPS) నాయకులు, రూరల్ ఇంచార్జ్ గందమాల నాగభూషణం మాదిగ,డిచ్ పల్లి మండలం ఇంచార్జ్ డప్పు నర్సయ్య మాదిగ, ఇందల్వాయి మండలం ఇంచార్జ్ సంగేమ్ కిష్టయ్య మాదిగ, ధర్పల్లి మండలం ఇంచార్జ్ నక్క రాజేందర్ మాదిగ, శ్రీరాములు మాదిగ, ఎ ఐ కె ఎమ్ ఎస్ జిల్లా అధ్యక్షులువేల్పూర్ భూమన్న, గ్రామ ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని సాయన్నకు నివాళులర్పించారు

## రఘునాథపాలెం సర్వే నెం.218 పట్టాదారులకు న్యాయం చేయాలి

- బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన ఖమ్మం నగర బీఆర్ఎస్ మాజీ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు



**ఖమ్మం, జులై 30, నేటి శుభోదయ**
2009 లో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో ఖమ్మం పట్టణంలో 3000 వేల మంది పేదలకు పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించకుండా చేతులు దులుపుకున్నారు. స్థలాల కోసం భాదితులు తిరగని ఆఫీస్ లేదు కానీ బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం కెసిఆర్ ముఖ్యమంత్రి అయైన తరువాత రఘునాథపాలెం గ్రామం, సర్వే నెం.218లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో పేదలకు పంపిణీ చేసిన 650 పట్టాదారుల సమస్యలను వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం నగర బీఆర్ఎస్ మాజీ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేద నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేసిన ఇంటి స్థలాలపై ప్రస్తుతం అమరావతి–హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ హైవే, మోడల్ స్కూల్ నిర్మాణం పేరుతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ కారణంగా సుమారు 300 మంది పట్టాదారులు తమ ఇళ్ల నిర్మాణంపై తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ అభివృద్ధి పనులకు బీఆర్ఎస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, అయితే పేదల హక్కులకు భంగం కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు నష్టం కలగకుండా సముచిత న్యాయం చేయాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి వారి హక్కులను కాపాడాలని కోరారు.అదేవిధంగా అమరావతి–హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో ప్రభావితమవుతున్న పట్టాదారులకు తక్షణమే పరిష్కారం చూపాలని, మిగిలిన పట్టాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి నెలరోజుల లోపు ఈ సమస్యను పరిష్కరిస్తానని బిఆర్ఎస్ ప్రతినిధుల బృందానికి హామీ ఇచ్చి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం సర్వే నెం.218 పట్టాదారులు, బాధిత కుటుంబాలు, బీఆర్ఎస్ నాయకులుమాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి ,బిచ్చాల తిరుమల రావు ,మలుసూరు , పొదిల నాగరాజు పాల్గొన్నారు.

## వెల్టూరు గ్రామ మాజీ సర్పంచ్ గడ్డమీద సత్యనారాయణ మాతృమూర్తికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు నివాళి



**సంగారెడ్డి, జులై 30, నేటి శుభోదయ :**
సదాశివపేట మండలంలోని వెల్టూరు గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డమీద సత్యనారాయణ గారి మాతృమూర్తి శ్రీమతి పార్వతమ్మ పరమపదించిన విషయం తెలుసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు వారి స్వగృహానికి వెళ్లి పార్వతమ్మ అమృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం గడ్డమీద సత్యనారాయణ గారితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారికి మనోధైర్యాన్ని కల్పించారు. పార్వతమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని ఎమ్మెల్యే గారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ కిష్టయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు చిక్కుల మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీనివాస్, గొల్ల నవీన్ తదితరులు ఉన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం.. క్యాంపు కార్యాలయంలో ప్రజలతో ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి , జులై 30, నటి శుభోదయ :**
సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గురువారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజలను కలిసి వారి సమస్యలను ఓర్పుగా విన్నారు. వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, ప్రజా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, వాటిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సత్వర పరిష్కారానికి కృషి చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తామని హామీ ఇచ్చారు.

## ఖానాపూర్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం



**మంథని, జూలై 30, నేటి శుభోదయ :**
రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు మంథని నియోజకవర్గంలోని ఖానాపూర్ గ్రామ బూత్ నంబర్-100 పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సెగ్గం రాజేశం, గ్రామ సర్పంచ్ సంగెం అరుణ-గట్టయ్య, సింగిల్ విండో డైరెక్టర్ రావికంటి సతీష్, యువ నాయకులు అనిల్ రెడ్డి, కొమ్మిడి నరేష్ రెడ్డి, బీఎల్ఏ సేమంతుల ఓదెలు, బీఎల్వో అమ్మకుంటి శ్రీధర్, యూత్ కాంగ్రెస్ నాయకులు పెగడ రాజు, బాస అశోక్ కుమార్, మదారి రమేష్, కరుణ మల్లయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ కాంగ్రెస్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లా వరప్రదాయిని సీతమ్మ సాగర్

- సీతమ్మ సాగర్ బ్యారేజ్ ఈసీ లైన్ క్లియర్
- తెలంగాణ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ల పర్యావరణ అనుమతులకు సుప్రీం తీర్పుపై మంత్రి తుమ్మల హర్షం
- సీతమ్మ ప్రాజెక్ట్ ద్వారా 36.37 టిఎంసీల నీటి నిల్వ
- 6.74 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు
- 282.80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి



**నిజామాబాద్, జులై 30, నేటి శుభోదయ :**
గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సశ్య శ్యామలంగా మార్చే సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ కు పర్యావరణ అడ్డంకులు తొలగి పోయాయి. ఇన్నాళ్లు పర్యావరణ అనుమతులు ఎన్.జీ.టీ కేసులతో నిర్మాణం నిలిచిపోగా, తాజాగా సుప్రీం కోర్టు తీర్పుతో పర్యావరణ చిక్కుముళ్ళు వీడిపోగా సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ పనులు ఇక పురోగతి బాట పట్టనున్నాయి .ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరదాయినిగా మారనుంది సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం దుమ్ముగూడెం మండలాల పరిధిలో సర్ ఆర్థర్ కాటన్ నిర్మాణం చేసిన ఆనకట్టకు 200 మీటర్ల దిగువన నిర్మాణం చేస్తున్నారు.--- ప్రాజెక్ట్ వివరాలు ఇలాసీతమ్మ సాగర్ బ్యారేజ్ 36.57 టీ. ఎం సీ ల నీటి నిల్వ సామర్థ్యం, భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం మహబూబాబాద్ జిల్లాల్లో 7 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించనున్నారు. 282 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి. కేసీఆర్ పాలనలో సీతమ్మ సాగర్ బ్యారేజ్ కు పర్యావరణ అనుమతులు లేవని కొందరు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసులు వేయగా పనులు నిలిచి పోయాయి.తాజాగా సుప్రీం కోర్టు తీర్పుతో తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులు పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులు పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతో ఇక పనులు చేసేందుకు లైన్ క్లియర్ అయింది. సుప్రీం తీర్పు తెలంగాణ సాగునీటి రంగానికి ఎంతో ఊరటనిచ్చిందని ,ప్రాజెక్టుల పర్యావరణ అనుమతుల అంశంలో ప్రత్యేక చొరవ చూపి కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులకు మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు.సుప్రీంకోర్టు తీర్పుతో రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యమున్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, అభివృద్ధి పనులకు ఉన్న అడ్డంకులు తొలగి పోయాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు తెలంగాణ జలవనరుల చరిత్రలో కీలక మైలురాయిగా నిలుస్తుందని సాగునీటి విస్తరణతో పాటు విద్యుత్ ఉత్పత్తి, వరద నియంత్రణ, భూగర్భ జలాల పెంపు వంటి అనేక ప్రయోజనాలను ఈ ప్రాజెక్టు అందిస్తుందని మంత్రి తుమ్మల తెలిపారు.--- జల ప్రదాయిని సీతమ్మ సాగర్ బ్యారేజ్, 36.57 టీఎంసీల నీటి నిల్వసీతమ్మ సాగర్ ప్రాజెక్టు 36.57 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యంతో నిర్మాణం తల పెట్టారు. నీటి నిల్వ రాష్ట్ర జలవనరుల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు భవిష్యత్ అవసరాలకు కీలక ఆధారంగా మారనుంది. --- 6.74 లక్షల ఎకరాలకు సాగునీటి భరోసా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని 6.74 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది.ఇందులో 3.28 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందే అవకాశం ఉంది .అలాగే నాగార్జున సాగర్‌లో నీటి కొరత ఏర్పడిన సందర్భాల్లో లేదా కరువు పరిస్థితుల్లో 3.45 లక్షల ఎకరాల నాగార్జునసాగర్ ఆయకట్టు ను స్థిరీకరించేందుకు సీతమ్మ సాగర్ బ్యారేజ్ వర ప్రదాయిని గా మారనుంది.--- 282.80 మెగావాట్ల జలవిద్యుత్ సీతమ్మసాగర్ ప్రాజెక్టు ద్వారా 282.80 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా నిర్మాణం చేస్తారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఇది కీలక పాత్ర పోషించడంతో పాటు స్వచ్ఛమైన, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి దోహద పడనుంది. --- భూగర్భ జలాల పెంపు, వరద నియంత్రణప్రాజెక్టు నిర్మాణంతో గోదావరి నదికి ఇరువైపులా సుమారు 50 కిలోమీటర్ల పరిధిలో భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని, బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని నిపుణులు మాట.అలాగే గోదావరి వెంట కరకట్టల నిర్మాణం ద్వారా అశ్వాపురం, మణుగూరు, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని పంటలు, గ్రామాలు వరద ముప్పు నుంచి రక్షణ పొందుతాయని ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. --- రాజకీయ జీవిత సాఫల్యం నెరవేరబోతుంది : మంత్రి తుమ్మలగోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సశ్య శ్యామలంగా మార్చాలనే తన రాజకీయ జీవిత సాఫల్యం నెరవేరబోతుందనీ మంత్రి తుమ్మల హర్షం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఎన్టీఆర్ చంద్రబాబు కేసీఆర్ ప్రస్తుతం రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో మంత్రిగా సాగు నీటి ప్రాజెక్ట్ ల ఏర్పాటులో ఎంతో కృషి చేశామని, సీతారామ ప్రాజెక్టు సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ తో సాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అవుతుందని మంత్రి తుమ్మల తన అనుభవాలు గుర్తు చేస్తున్నారు. --- సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు తో రైతులకు సాగునీటి భరోసారాష్ట్రానికి అదనపు విద్యుత్ ఉత్పత్తి, భూగర్భ జలాల పెంపు, వరద నియంత్రణ, ప్రాంతీయ సమగ్రాభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల రైతాంగంతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని తన రాజకీయ జీవిత సాఫల్యం గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సశ్య శ్యామలంగా మార్చాలనే భగీరథ ప్రయత్నం రేవంత్ రెడ్డి పాలనలో పూర్తి అవుతుందని మంత్రి తుమ్మల వెల్లడించారు.

## డైమండ్ వరల్డ్ రికార్డ్స్ లో గాయని మాలతి

**ఖమ్మం, జులై 30, నేటి శుభోదయ :**
ఖమ్మం గాయని వంజా మాలతినాయుడు మరొక వరల్డ్ రికార్డు నమోదు చేసుకున్నారు.బుధవారం హైదరాబాద్ లో గాన గంధర్వ కల్చరల్ ఆర్గనైజేషన్ నిర్వహించిన నిర్విరామ గానాలాపనలో ఆమె 123 యుగళ గీతాలను ఆలపించి డైమండ్ వరల్డ్ రికార్డ్స్ లో నమోదయ్యారు.తెలంగాణ రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, కళాబ్రహ్మ వంశీ రామరాజు,వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ జాతీయ ముఖ్య సమన్వయకర్త బింగి నరేందర్ గౌడ్ చేతులమీదుగా ధృవీకరణ పత్రం,మెడల్,జ్ఞాపికను ఆమె అందుకున్నారు. 2024లో 5 అంతర్జాతీయ రికార్డులు సాధించడంతోపాటు1 జాతీయ అవార్డును మాలతి అందుకున్నారు.అనంతరం వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డు తోడుగా గాత్రరత్న,గానరత్న బిరుదులు పొందారు.తాజాగా ప్రతిష్టాత్మక వంశీ మహానంది మ్యూజిక్ అవార్డ్-2026 అందుకున్నారు.గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డ్స్ ఫోరం తెలంగాణ రాష్ట్ర ముఖ్య సమన్వయకర్త గా వ్యవహరిస్తున్నారు.సొంతగా వియంయన్ కల్చరల్ అసోసియేషన్-ఖమ్మంను స్థాపించి పలు సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.డైమండ్ వరల్డ్ రికార్డ్ లో నమోదైనందుకు మాలతిని పలు సాంస్కృతిక సంస్థలు,కళాకారులు అభినందనలు తెలిపారు.




## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### - ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో అర్బన్ ఎమ్మెల్యే సూచన..

**నిజామాబాద్, జులై 30, నేటి శుభోదయ :**
గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.కార్పొరేషన్ అధికారులు,సిబ్బంది నగరవాసులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.ప్రధానంగా శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్ర పరచాలన్నారు.లోతట్టు ప్రాంతాల్లో నీరు నిండకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్,ఉన్నతాధికారులతో పాటు సంబంధిత విభాగాధిపతులు సిబ్బందితో సమాచారం తెలుసుకుంటూ ముందుకెళ్లాలని చెప్పారు.నాలాలు సరిగా లేనిచోట ముంపు సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.నగరంలోని ప్రధాన కూడళ్లలో వర్షపు నీరు చేరి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.అధిక వర్షపాతం నమోదైనప్పుడు నాలాలు వెంటనే శుభ్రం చేయాలన్నారు.నీరు నిండిన చోట తోడేందుకు భారీ మోటార్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.అవసరమైతే ప్రత్యేక బృందాన్ని సిద్ధంగా ఉంచాలన్నారు.



## ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి) విజయఢంకా



- నషా ముక్త్ యువ పోటీల్లో అత్యధిక బహుమతులతో రాష్ట్ర స్థాయికి ఘన ఎంపిక
- నషా ముక్త్ యువ
- వికసిత్ భారత్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రియదర్శిని విద్యార్థినుల ప్రతిభకు రాష్ట్ర స్థాయి అర్హత

**ఖమ్మం, జులై 30, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా కేంద్రంలోని స్వర్ణ భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్" జిల్లా స్థాయి పోటీల్లో ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్) విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచి అత్యధిక బహుమతులను కైవసం చేసుకున్నారు. పలు విభాగాల్లో విజేతలుగా నిలిచి, త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించడం కళాశాలకు గర్వకారణమైంది.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కె. నవీన్ బాబు విద్యార్థినుల కృషిని అభినందిస్తూ, వారి క్రమశిక్షణ, అంకితభావం మరియు ప్రతిభ ఫలితంగానే ఈ ఘన విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో కూడా ఇదే ఉత్సాహంతో పాల్గొని కళాశాలకు మరిన్ని విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే సాంస్కృతిక, సామాజిక మరియు సహపాఠ్య కార్యక్రమాల్లో పాల్గొనేలా కళాశాల నిరంతరం ప్రోత్సహిస్తోందన్నారు. ఈ విజయం వెనుక అధ్యాపకుల కృషి, మార్గదర్శకత్వం, విద్యార్థినుల పట్టుదల ప్రధాన కారణాలని పేర్కొన్నారు.అకాడమిక్ డైరెక్టర్ ఎ. వెంకటరమణ మాట్లాడుతూ అన్ని విభాగాల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచిందన్నారు. విద్యార్థినుల ఈ విజయం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నృత్య విభాగంలో మొదటి స్థానంలో సిహెచ్ తేజ శ్రీ బృందం, నుక్కడ నాటక్ విభాగంలో మొదటి స్థానంలో ఎం గోపిక బృందం, పెయింటింగ్ విభాగం లో మొదటి స్థానం లో సిహెచ్ లక్ష్మీ ప్రసన్న, ఎలక్యూషన్ విభాగంలో మొదటి విభాగంలో బి రమ్యశ్రీ, స్లోగన్ రైటింగ్ విభాగంలో మొదటి స్థానంలో ఏ అనన్య, మరియు రెండో స్థానంలో బి రమాశ్రీ, స్లామ్ పోయెట్రీ విభాగంలో రెండో స్థానంలో జై గౌతమి, రీల్/షార్ట్ ఫిలిం విభాగంలో రెండవ స్థానంలో ఎన్ వెన్నెల బృందం, విజేతలుగా నిలిచి హైదరాబాదులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శివ రామకృష్ణ, కల్చరల్ ఇన్‌చార్జ్ ఆర్.వి.ఎన్.ఎస్. ప్రసాద్ విద్యార్థినులను అభినందించి, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల విద్యార్థినుల ఈ విశేష విజయంతో యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## మానవ అక్రమ రవాణా నివారణ అవగాహన ద్వారానే సాధ్యం




**ఖమ్మం, జులై 30, నేటి శుభోదయ :** మానవ అక్రమ రవాణాను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే అవగాహన ద్వారానే సాధ్యమవుతుందని షీ టీం మరియు యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ ఇన్స్పెక్టర్ శివ నాగుల శ్రీనివాస్ అన్నారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం జూలై 30 సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ మరియు పోలీస్ యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా మొత్తం బాధితులలో 26% మంది పిల్లలే అని 71 శాతం మంది మహిళలు మరియు యుక్త వయసు బాలికలు అని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగులు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు ఉపాధి కోసం వలస వెళ్లేవారు కూడా అత్యంత ఎక్కువ ప్రమాదం లో ఉంటారని గ్రామాలలో పాఠశాలలో కమ్యూనిటీ మీటింగ్లలో ఈ అంశంపై విస్తృతంగా ప్రచారం చేయాలని చర్చలు నిర్వహించాలని అన్నారు. మానవ అక్రమ రవాణా ఈ విధంగా జరుగుతుందో ఎలా అప్రమత్తంగా ఉండాలో చిన్న చిన్న స్కిట్ ల ద్వారా ఆయన బాలబాలికలను ఉత్తేజపరిచారు . ఆన్లైన్ మోసాలు వేధింపులు, ఇతర సమస్యలకు డైల్ 100 లేదా 1930లకు ఫోన్ చేసి తెలిపి సహాయం పొందాలని అన్నారు. మరో అతిధి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ సురేష్ గౌడ్ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలబాలికలు సామాజిక మాధ్యమాలను విరివిగా వినియోగిస్తూ తమ యొక్క విలువైన సమయాన్ని వృధా చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమయాన్ని సద్వినియోగం చేసుకొని సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల యొక్క ఆకాంక్షలను అర్థం చేసుకొని చక్కగా చదివి జీవితంలో రాణించాలని పిలుపునిచ్చారు. మరో అతిధి బాలల సంక్షేమ కమిటీ చైర్పర్సన్ భారతరాణి మాట్లాడుతూ విద్య ద్వారానే ఏదైనా సాధించవచ్చని సమాజంలో మంచి పౌరులుగా రాణించి ఉన్నత వ్యక్తిత్వం కలిగిన బాధ్యతగల పౌరులుగా విద్య మాత్రమే తీర్చిదిద్దుతుందని తెలిపారు. బాలల సంక్షేమ కమిటీ ద్వారా బాలలకు అందించే సేవలు గురించి వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఫోన్ చేసి తెలపాలన్నారు. ఏఐడీ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ 2013 నుంచి ఐక్యరాజ్యసమితి జులై 30 ని మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం గా జరుగుతుందని అన్నారు. మానవ క్రమ రవాణా అనేది ప్రస్తుతం స్కాముల ద్వారా కూడా జరుగుతుందని ఆ ట్రాప్ లో ఎవరూ పడవద్దని తెలిపారు. అక్రమ రవాణాకు గురైన వ్యక్తులతో పారిశ్రామిక స్థాయి సైబర్ మోసాలతో ముడిపడి ఉంటుందని నకిలీ ఉద్యోగ ఆఫర్లు నేరపూరిత బృందాలు తప్పుడు విదేశీ ఉద్యోగ ప్రకటనల ద్వారా మోసం చేస్తారని రిప్టో కరెన్సీ, ఇతర స్కాముల్లో నెట్టివేయబడతారని అన్నారు. మానవక్రమ రవాణా ప్రతి సంవత్సరము 236 బిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుందంటే తీవ్రతను అర్థం చేసుకోవాలని అన్నారు. అక్రమ రవాణా బాధితులలో 38 శాతం మంది బాలలు ఉన్నారని కావున ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటూ అనుమానాస్పదంగా ఉంటే పోలీసు వారికి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె శ్రీనివాస్, ఏ హెచ్ టి యు బాధ్యులు ఉదయ్ భాస్కర్, షీ టీం కానిస్టేబుల్ రుక్మిణి, సభ్యులు రాందాస్, రవిచంద్ర, రవీంద్ర భాస్కర్, పారాలిగల్ వాలంటీరు మాధవి లత, నయా బజార్ జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నవాబ్‌పేట్ కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలపై కార్యకర్తల్లో అయోమయం

- నవాబ్‌పేట్ కాంగ్రెస్‌లో అసలు నాయకుడు ఎవరు..?
- గ్రూపు రాజకీయాలతో కార్యకర్తలు అయోమయం
- అధిష్ఠానం వెంటనే జోక్యం చేసుకోవాలన్న డిమాండ్"




**వికారాబాద్, జూలై 30, నేటి శుభోదయ :**
వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండల కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గ రాజకీయాలు కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజల్లో కూడా అయోమయానికి దారితీస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మండలంలో కాంగ్రెస్ పార్టీకి ఎన్ని వర్గాలు ఉన్నాయో, పార్టీ తరఫున ఎవరి నాయకత్వాన్ని అనుసరించాలో స్పష్టత లేకపోవడంతో కింది స్థాయి కార్యకర్తలు సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు చర్చ జరుగుతోంది.పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన సమయంలో వర్గాల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల పార్టీ కార్యక్రమాల నిర్వహణ, కార్యకర్తల భాగస్వామ్యం, ప్రజల్లో పార్టీపై ఏర్పడే అభిప్రాయంపై ప్రభావం పడుతోందని పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పేర్కొంటున్నారు. ఒకే పార్టీకి చెందిన నాయకులు వేర్వేరు వర్గాలుగా వ్యవహరించడం వల్ల ఎవరికి సహకరించాలి, అధికారికంగా పార్టీ బాధ్యతలు ఎవరి వద్ద ఉన్నాయనే విషయంలో స్పష్టత లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు అంటున్నారు.ఈ పరిస్థితులకు తెరదించేందుకు పార్టీ అధిష్ఠానం తక్షణమే జోక్యం చేసుకుని నవాబ్‌పేట్ మండల కాంగ్రెస్‌లో అధికారిక నాయకత్వం, బాధ్యతలు, పార్టీ నిర్మాణంపై స్పష్టమైన ప్రకటన చేయాలని కార్యకర్తలు కోరుతున్నారు. స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తే కార్యకర్తల్లో ఉన్న అయోమయం తొలగడంతో పాటు పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారి అభిప్రాయం.

## భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో సదాశివపేట మండల ప్రజలకు పోలీస్ సూచనలు ఇన్స్పెక్టర్ డి. వెంకటేశం



**సంగారెడ్డి , జులై 30, నేటి శుభోదయ :**

1. పాడుపడ్డ లేదా పగుళ్లు ఉన్న ఇళ్లలో ఉండకూడదు.
2. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు వెళ్ళకూడదు.
3. కరెంటు స్తంభాలు , తెగిన వైర్లు ఉన్న దగ్గరికి వెళ్ళకూడదు– ముట్టకూడదు.
4. పంట పొలాల దగ్గర బోర్ మోటార్స్ వేసినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
5. పారుతున్న వాగులు ,వంతెనలు , నదులు గుండా నడిచేవారు కానీ వాహన దారులు విటి గుండా దాటకూడదు.
6. వర్షపు నీరు ఎక్కువగా చేరిన ప్రాంతాల్లో నడవ కూడదు.
7. చిన్నారులు , వృద్ధులు , గర్భిణీలు బయటకు వెళ్ళ వద్దు.
8. ఈత కోసం , చేపల వేటకు వెళ్లి మరియు సరదాగా సెల్ఫీ కోసం వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోకండి.
9. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100/112 కు కాల్ చేయండి.

## ఊర పండుగ కోసం బండారు పోసిన సర్వసమాజ్ కమిటీ



**నిజామాబాద్, జూలై 30, నేటి శుభోదయ :** సర్వ సమాజ్ కమిటీ నిర్ణయం మేరకు ఆగష్టు 2న జరగబోయే ఊర పండుగనూ పురస్కరించుకొని శుభసూచకంగా గురువారం నిజామాబాద్ (ఇందూర్) సర్వసమాజ్ కమిటీ& శ్రీ విజయ్ కిసాన్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో పసుపు,కుంకుమలు,పూలతో బండారు పోసి,కల్లు సాకాలు సమర్పించడం జరిగింది.ఈ సందర్భంగా దున్నపోతునూ ఊరి మీదకు విడవడం జరిగింది. ఈరోజు నుండి మన గ్రామ దేవతలా విగ్రహాలు తయారీ,ఊర పండగ కోసం ఏర్పాట్లు ప్రారంభించడం జరిగింది.అలాగే అనాదిగా వస్తున్న ఆచారం,మన పెద్దల ద్వారా ఆనవాయితీగా వస్తున్న ఊర పండుగ,గ్రామ దేవతల ఊరేగింపులో ప్రజలందరు పెద్ద ఎత్తున పాల్గొని,మన గ్రామ దేవతల తల్లుల ఆశీర్వాదం తీసుకోవాలని,ఈ ఊర పండుగతో పాడిపంటలు,పశు సంపద అభివృద్ధి చెందాలని,పిల్లలు,పెద్దలు ఆయురారోగ్యాలతో వుండాలని,ప్రజలందరీకి అష్టఐశ్వరాలు కల్గాలని,దుష్ట శక్తులు దరి చేరకుండా ఉండాలని సర్వసమాజ్ కమిటీ కో కన్వీనర్ ఆదే ప్రవీణ్ కుమార్ అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ విజయ్ కిసాన్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కోరడి కిరణ్,ఉపాధ్యక్షులు&కార్పొరేటర్ మల్కాయి మహేందర్,మాజీ కార్పొరేటర్ రామాడ్గు బాలకిషన్,సెక్రటరీ ధామ ఇంద్రకరణ్,పెద్ద కాపులు మల్కాయి లక్ష్మి నారాయణ,గంట పెద్ద నర్సయ్య స్వామి,లింబాద్రి స్వామి,కొరడీ చిన్న నర్సయ్య,కోర్వ భూపాల్,పెద్ద మనుషులు సుంకేటి ప్రవీణ్,మల్కాయి భోజన్న,జానకంపేట్ అశోక్,మల్కాయి సుదర్శన్,పసుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## జలసిరి కార్యక్రమం నిర్వహించిన తొండకూర్ గ్రామ పాలకవర్గం




**నిజామాబాద్ , జూలై 30, నేటి శుభోదయ :**
డొంకేశ్వర్ మండలం తొండకూర్ గ్రామంలో గురువారం జలసిరి కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది.అదేవిధంగా గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమలలో సర్పంచ్ అల్లరి గంగాధర్ మాట్లాడుతూ....ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించాలని,ప్రతి నీటి బొట్టుని కాపాడుకోవాలని,కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని గ్రామ ప్రజలను కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మజారుద్దీన్,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు,మహిళా సంఘాలు పాల్గొనడం జరిగింది.

## వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**నిజామాబాద్, జూలై 30, నేటి శుభోదయ :** ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ భుజ ంగ రావు తెలిపారు.వర్షాల వల్ల జిల్లాలో నెలకొని ఉన్న పరిస్థితులను కంట్రోల్ రూమ్ ద్వారా సమీక్షించడం జరుగుతుందని అన్నారు.భారీ వర్ష సూచనల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని,ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా సన్నద్ధంగా ఉండాలని క్షేత్రస్థాయి అధికారులు,సిబ్బందిని అదనపు కలెక్టర్ ఆదేశించారు.వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడినట్లు సమాచారం అందిన వెంటనే అధికారులను అప్రమత్తం చేయాలని కంట్రోల్ రూమ్ సిబ్బందికి సూచించారు.జిల్లాలో ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని,ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని తెలిపారు.జిల్లా యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నామని అన్నారు.వర్షాల వల్ల జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే,కలెక్టరేట్ లో కొనసాగుతున్న కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్:08462 – 220183 కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

## నవాబుపేట్ మెయిన్ రోడ్డుకు తక్షణ మరమ్మతులు చేయాలి : పత్తేపురం ప్రభాకర్ రెడ్డి



**వికారాబాద్, జూలై 30, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా నవాబుపేట్: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నవాబుపేట్ మండల ప్రధాన కార్యదర్శి పత్తేపురం ప్రభాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో అవి వాహనదారులకు కనిపించకుండా ప్రమాదాలకు కారణమవుతున్నాయని తెలిపారు. గురువారం ఒక స్కూటీ, స్ప్లెండర్ బైక్ గుంతల్లో పడటంతో ఇద్దరు వాహనదారులు గాయపడిన ఘటన దీనికి నిదర్శనమని పేర్కొన్నారు.నవాబుపేట్ ప్రధాన రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడే చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. గతంలో మండల బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకోలు, ధర్నాలు, పాదయాత్రలు నిర్వహించడంతో పాటు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని అన్నారు. అంతేకాకుండా సోషల్ మీడియా వేదికల్లో"All Eyes On Nawabpet Roads" పేరుతో ప్రజా ఉద్యమం చేపట్టినా పాలకులు స్పందించకపోవడం బాధాకరమని విమర్శించారు.దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సమస్యను ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు అత్యవసరంగా గుర్తించి రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నట్లు పత్తేపురం ప్రభాకర్ రెడ్డి తెలిపారు

## ఎన్యుమరేషన్ ఫారాలు త్వరగా పూర్తి చేయాలి : అడిషనల్ కలెక్టర్ హరిప్రియ



**మిడ్జిల్, జూలై 30, నేటి శుభోదయ :** మిడ్జిల్: మండల కేంద్రంలో ఎన్యుమరేషన్ ఫారాల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ హరిప్రియ అధికారులను ఆదేశించారు. గురువారం మిడ్జిల్ మండల కేంద్రంలో సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు జరిగిన ఫారాల నమోదు పురోగతిని పరిశీలించి, మిగిలిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ప్రతి అర్హుడికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వివరాలు సక్రమంగా నమోదు చేయాలని, ఫీల్డ్ స్థాయిలో సిబ్బంది మరింత సమన్వయంతో పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు. అలాగే ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రాఘవేందర్ రెడ్డి, రెవిన్యూ సిబ్బంది భాష, బిఎల్వోలు, అంగన్వాడి టీచర్లు, తదితరులు పాల్గొన్నారు

## నిర్ణిత షెడ్యూల్ ప్రకారం యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- **డ్రగ్స్, మత్తు పానీయాలు సేవించడం వ్యాధి కంటే ప్రమాదకరం**
- **ప్రజల సహకారంతో గంజాయి రహిత సమాజమే లక్ష్యం : పోలీస్ కమిషనర్ సునీల్ దత్**
- **డ్రగ్స్ బారిన పడినట్లు అనుమానం వస్తే 1908 కు సమాచారం అందించాలి**
- **అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, పోలీస్ కమీషనర్**





**ఖమ్మం, జులై 30, నేటి శుభోదయ :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు.ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని రఘునాథపాలెం వైఎస్ఆర్ నగర్ ప్రధాన దారిలో రూ. 200 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. స్కూల్ నిర్మాణంలో హాస్టల్స్ భవనాలు, అకాడమిక్ బ్లాక్‌లు, డార్మిటరీ భవనం, వంటగది, భోజనశాల, ప్రధాన నివాస గృహం, క్వార్టర్స్ నిర్మాణ ప్రాంతాలను కాలి నడకన పరిశీలిస్తూ భవనాల పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోజక వర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగానే ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి అగ్రిమెంట్ ప్రకారం స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తోందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంలోనూ రాణించేలా అత్యాధునిక మౌళిక వసతులతో ఈ విద్యాసంస్థలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.పాఠశాల ఆవరణలో విద్యార్థుల రాకపోకలకు అనువుగా లింక్ రోడ్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పచ్చదనం వంటి మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు.నిర్మాణ సంస్థలు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ, నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం రఘునాథపాలెం మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ (బాలుర) గురుకుల పాఠశాల/కళాశాల భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. నెలరోజుల లోపు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ తనిఖీలో కలెక్టర్ వెంట రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దొంగ ఓట్ల నమోదు కోసమే 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్'

### -బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి



**నిజామాబాద్, జూలై 30, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్'ను ఓటర్ల జాబితా సవరణ(సార్)ప్రక్రియలో ప్రామాణికంగా తీసుకోకూడదని డిమాండ్ చేస్తూ,బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి ఆధ్వర్యంలోని బిజెపి నాయకుల బృందం గురువారం అడిషనల్ కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 25వ తేదీన (జీ.ఓ.ఎం.ఎస్. నెం.172 ద్వారా) 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్'ను హడావిడిగా తీసుకువచ్చింది.రేషన్ కార్డుల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ వ్యవస్థను ఏర్పాటు చేసి,మీ సేవా కేంద్రాల ద్వారా సర్టిఫికెట్లు జారీ చేస్తామని చెబుతున్నారు.కానీ,సరిగ్గా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరుగుతున్న సమయంలోనే ఈ కొత్త సర్టిఫికెట్ తీసుకురావడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది.ఇది ముమ్మాటికీ అధికార కాంగ్రెస్ పార్టీ,దాని మిత్రపక్షం ఎంఐఎం కలిసి దొంగ ఓట్లను నమోదు చేయడానికి పన్నిన వ్యూహమే.ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ ముఖ్యమంత్రికి విన్నవించిన వెంటనే ఈ జీవో రావడం చూస్తుంటే,ఈ సర్టిఫికెట్‌ను అడ్డం పెట్టుకుని భారతదేశానికి చెందని వారిని ఓటర్లుగా చేర్పించుకోవాలనే దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది.ఓటర్ల జాబితా సవరణకు ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది.ఈ ప్రక్రియ మధ్యలో కొత్తగా మరో పత్రాన్ని చేర్చే లేదా వెరిఫికేషన్ నిబంధనలను మార్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి గానీ,ఇతర యంత్రాంగానికి గానీ లేదని స్పష్టంగా చెప్పినా...కావాలనే తెలంగాణ ప్రభుత్వం ఫ్యామిలీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పేరిట కొత్త డ్రామాలకు తెరతీసింది.అసలు ఈ ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ అనేది భారత పౌరసత్వానికి ఎట్టి పరిస్థితుల్లోనూ రుజువు కాదు.మేము జిల్లా యంత్రాంగాన్ని,ఎన్నికల అధికారులను ఒక్కటే డిమాండ్ చేస్తున్నాము.ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఈ 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్'ను ఒక ప్రామాణిక పత్రంగా ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తించకూడదు.నోటిఫికేషన్ ఇచ్చిన రోజున ఏ నిబంధనలు అయితే ఉన్నాయో,వాటి ఆధారంగానే ఓటర్ల నమోదు పారదర్శకంగా జరగాలి.ఈ విషయంలో అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై దుష్ప్రచారం తగదు : జిల్లా గ్రంథాలయ సంస్థ ఖమ్మం ఛైర్మన్ ఎం.డి. ఖాదర్ బాబా



**ఖమ్మం, జులై 30, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావుపై కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారాలను ప్రజలు నమ్మబోరని జిల్లా గ్రంథాలయ సంస్థ ఖమ్మం ఛైర్మన్ ఎం.డి. ఖాదర్ బాబా అన్నారు.ఆయన మాట్లాడుతూ సంబంధిత చెక్‌డ్యామ్ నిర్మాణాన్ని అప్పట్లోనే నిపుణులు, ఇంజనీర్లు వ్యతిరేకించినప్పటికీ వారి సూచనలను పట్టించుకోకుండా నిర్మాణం చేపట్టారని తెలిపారు. నిర్మాణం జరుగుతున్న సమయంలోనే చెక్‌డ్యామ్ దెబ్బతినడం, అనంతరం సమీప వంతెనకు ముప్పు ఏర్పడే పరిస్థితులు తలెత్తడంతో నిపుణుల సూచనల మేరకు చెక్‌డ్యామ్‌లో కొంత భాగాన్ని తొలగించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. మొదట రూ.4 కోట్ల అంచనాతో ప్రారంభించిన పనులను అనంతరం రూ.7.50 కోట్లకు పెంచి, అప్పటి మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌కు చెందిన సంస్థకు అప్పగించారని ఖాదర్ బాబా ఆరోపించారు. నాసిరకం నిర్మాణం వల్ల ప్రజాధనం వృథా కావడంతో పాటు ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని విమర్శించారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం జిల్లా అభివృద్ధికి విశేష సేవలు అందించిన నాయకుడని, ఆయనపై అసత్య ప్రచారం చేయడం మానుకుని వాస్తవాలతో మాట్లాడాలని ప్రతిపక్షాలకు సూచించారు. ప్రజల సంక్షేమం, నాణ్యమైన అభివృద్ధే మంత్రి తుమ్మల లక్ష్యమని ఛైర్మన్ ఎం.డి. ఖాదర్ బాబా పేర్కొన్నారు.

## వినాయక చవితి,నిమజ్జనోత్సవాలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలి
### :రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

- **గణేష్ నిమజ్జనోత్సవాలపై కిస్మత్ పూర్ లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జోనల్ స్థాయి సమావేశం**



**రాజేంద్రనగర్, జులై 30, నేటి శుభోదయ :** సెప్టెంబర్ 14న ప్రారంభమయ్యే వినాయక చవితి మొదలుకొని సెప్టెంబర్ 25వ తేదీ అనంత చతుర్దశి రోజు వరకు జరిగే వినాయక నిమజ్జనోత్సవాల కు అన్ని ఏర్పాట్లు చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే, రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు టి ప్రకాష్ గౌడ్ అదికారులకు ఆదేశాలు జారీ చేశారు.గురువారం కిస్మత్ పూర్ లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన గణేష్ నిమజ్జనోత్సవాలపై జరిగిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.వినాయక నిమజ్జనం ఊరేగింపు జరిగే అన్ని రహదారులను బాగు చేయాలన్నారు.నిమజ్జన ఊరేగింపు జరిగే ప్రాంతాలలో అడ్డంగా కరెంటు వైర్లు,చెట్లు ఉంటే వాటిని సరి చేసే విధంగా విద్యుత్,జీహెచ్ఎంసీ అధికారులు చొరవ చూపాలన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు.రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కృషితో హనుమాన్ నగర్ పత్తికుంట (వినాయక సాగర్)లో రాబోయే రోజుల్లో అందంగా తీర్చిదిద్దడానికి,వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయడానికి కావలసిన అన్ని ఏర్పాట్లు జరుగుతాయన్నారు.మండపాల నిర్వాహకులు శాంతియుత వాతావరణంలో ఇతరులకు ఇబ్బందులు కలకుండా ఊరేగింపు చేయాలన్నారు.పత్తి కుంట,పల్లె చెరువు వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.సమావేశానికి అధ్యక్షత వహించిన రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్,అత్తాపూర్,కిస్మత్ పూర్,బండ్లగూడ,చాంద్రాయణగుట్ట,పాతబస్తీలోని ప్రాంతాలన్నిటిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని అందుకోసం అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకు కదలాల్సిన అవసరం ఉందన్నారు.బాలాపూర్ గణేష్ నిమజ్జన ర్యాలీ రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని పాతబస్తీ రోడ్ల గూండా వెళ్తున్న నేపథ్యంలో ఆ రహదారులను కూడా బాగు చేయడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.వినాయక మండపాల నిర్వాహకులు అధికారులకు సహకరించి శాంతియుతంగా నిమజ్జనోత్సవాలు జరిగేలా చూడాలన్నారు.ఈ సంవత్సరం మీరాలం చెరువు వద్ద పనులు జరుగుతున్నందువల్ల అక్కడ నిమజ్జనాలు ఉండవన్నారు.మండపాల నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలి:రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్..వినాయక మండపాలు నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని,అలా చేసినట్లయితే బందోబస్తుకు ఇబ్బందులు ఉండవన్నారు.వినాయక చవితి,నవరాత్రులు,నిమజ్జోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.మండపాల వద్ద అనుమానితులు ఎవరైనా కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.అనుమతుల పేరిట ఇబ్బందులు పెట్టవద్దు:భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్..అనుమతుల పేరిట మండపాల నిర్వాహకులను ఇబ్బందులు పెట్టవద్దని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ అన్నారు.అనుమతులు అనే దాని బదులు ఇంటిమేషన్ ఇస్తే చాలు అని అంటే బాగుంటుందన్నారు.గణేష్ నిమజ్జోత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం అన్ని శాఖల అధికారులపై ఉందన్నారు.కిస్మత్ పూర్,పీరం చెరువు ప్రాంతాలలో నిమజ్జన పాయింట్లను పెట్టీ అన్ని సౌకర్యాలు కల్పించాలి:మాజీ మేయర్ బి మహేందర్ గౌడ్..కిస్మత్ పూర్,పీరం చెరువు ప్రాంతాలలో నీటి సౌకర్యం ఉన్నచోట నిమజ్జన పాయింట్లు ఏర్పాటు చేసి క్రేన్,విద్యుత్,ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ బి మహేందర్ గౌడ్,గోకరి సురేష్ గౌడ్ లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.హిమాయత్ సాగర్ నుంచి వచ్చే వాహనాలను వన్ వే గా పోనివ్వాలి:భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ వై శ్రీధర్..హిమాయత్ సాగర్ నుంచి వచ్చే వాహనాలను కుడివైపు రోడ్డు గుండా వన్వేలో వెళ్ళేటట్లు చూడాలన్నాని భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ వై శ్రీధర్ కోరారు.పత్తికుంట వైపు ఉన్న రోడ్డులో కేవలం వినాయక నిమజ్జనోత్సవాల వాహనాలకే ఉపయోగించేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనాలు జరిగే ప్రాంతాలలో ముందుగానే ఏర్పాట్లు చేయాలన్నారు.కరెంటు తీగెలను సరి చేయాలి..శివరాంపల్లి ఎం ప్రభాకర్ రెడ్డ.. శివరాంపల్లి పెద్ద వినాయకుడు ఊరేగింపుగా నిమజ్జనానికి వెళ్లడం జరుగుతుందని,కరెంటు తీగలను విద్యుత్ అధికారులు సరిచేయాలని ఆ బస్తీకి చెందిన ఎం ప్రభాకర్ రెడ్డి కోరారు.గత సంవత్సరం విద్యుత్ వైర్లు తగడం తగలడం వల్ల చాలా ఇబ్బందులు కలగాయన్నారు.గడచిన 18 సంవత్సరాలుగా ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ నాయకత్వంలో వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతున్నాయని రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు ఇంద్ర పాల్ రెడ్డి అన్నారు.ఈ సంవత్సరం కూడా అధికారులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే,భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు ఆలె భాస్కర్ రాజ్,కార్యదర్శి కె మహేందర్,సెంట్రల్ కమిటీ సభ్యులు ఎన్ మల్లారెడ్డి,బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్,రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్,రాజేంద్రనగర్ జోనల్ ఎస్ ఈ నరేందర్ గౌడ్,రాజేంద్రనగర్ విద్యుత్ డీఈ రత్నాకర్ రావు,రాజేంద్రనగర్,అత్తాపూర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ లు బి సురేందర్ రెడ్డి,మల్లారెడ్డి,జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ జోహార్ అలీ,జీహెచ్ ఎంసీ ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన సత్యనారాయణ రెడ్డి,నాయకులు ఎన్ ధనుంజయ,జోగి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు భేష్
### : ఎన్.సి.డి.సి కన్సల్టెంట్ డాక్టర్ సామ్ జాన్ ప్రశంస

**ఖమ్మం, జులై 30, నేటి శుభోదయ :** కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్ సిడిసి) కన్సల్టెంట్ డాక్టర్ సామ్ జాన్ (స్టేట్ పబ్లిక్ హెల్త్ అవుట్‌బ్రేక్ బృందం) గురువారం ఖమ్మం జిల్లాలో పర్యటించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాలో అమలవుతున్న 10 రకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.అనంతరం ఆయన ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, జిల్లా పబ్లిక్ హెల్త్ లాబొరేటరీ (ఐడిఎస్ పి ల్యాబ్)లను సందర్శించి, ఆయా ల్యాబ్‌లలో జరుగుతున్న పరీక్షలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మామిళ్లగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, క్షేత్రస్థాయిలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలకు అందుతున్న తీరును నేరుగా వెరిఫై చేశారు.టీకా కార్యక్రమం (విపిడి) పట్ల ప్రత్యేక అభినందనలు. జిల్లాలో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అత్యంత సమర్థవంతంగా అమలవుతుండటం పట్ల డాక్టర్ సామ్ జాన్ సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా వ్యాక్సిన్ల ద్వారా నివారించదగిన వ్యాధుల నియంత్రణ కార్యక్రమం అమలు తీరును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే సమయంలో, కార్యక్రమాలకు సంబంధించిన కీలక సూచికలను మరింత మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేయాలని, కొన్ని కీలక సూచనలను అధికారులకు అందించారు.ఈ సమీక్షా సమావేశంలో మరియు క్షేత్రస్థాయి పర్యటనలో ఐడిఎస్పి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఐ. మోధ్యా, ఎన్సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణాదేవి, ఇన్చార్జ్ ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ ఇ. సాయి కుమార్, జిల్లా డేటా మేనేజర్ (డిడిఎం ) కె. కృష్ణమోహన్, ఎంపిహెచ్ఎస్ (ఎం) ఎ. సతీష్ తదితర వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.






## ఓటరు ప్రక్రియ ఆగస్టు 3తో ముగియనుంది త్వరపడి అప్లై చేసుకోండి:అందే లక్ష్మణరావు

**రాజేంద్ర నగర్,జులై 30, నేటి శుభోదయ :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతికి లోబడి చట్టబద్ధతగా ఓటు హక్కు డిజిటలైజేషన్ ప్రక్రియను మొదలు పెట్టారు.ఈప్రక్రియ ఆగస్టు 3 తో ముగియనుండగా మణికొండ,నెక్నంపుర్ డివిజన్ ప్రజానీకం స్పందించి,ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కను వజ్రాయుధంగా పరిగణనలోకి తీసుకుని, ఓటు హక్కు కోల్పోవద్దనే సదుద్దేశంతో కొంత మంది తమ తమ ఓటును డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా సద్వినియోగ పరుచు కోవడానికి గురువారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 వరకు పంచవటి కాలనీ గ్రంథాలయంకి,మరి కొంత మంది స్థానికులు ఉదయం 11 నుండి 2 సాయంత్రం 4 నుండి 7 వరకు షిర్డీ సాయి నగర్ శ్రీ చైతన్య కాలనీకి విచ్చేయడం ద్వారా ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సహాయ శిబిరంలో వారికి భారత రాష్ట్ర సమితి స్థానిక నేతలు అందే లక్ష్మణ్ రావు, సుమనళిని,సంగం శ్రీకాంత్,జయరాం,తిరుపతి తదితరులు ఓటు వివరాలను తెలుపుతూ,2002లో వారి యొక్క లేదా వారి పరివారం సభ్యుల ఓటు వివరాలను తెలుసుకొని ఎన్యూమరేషన్ ధరకాస్తూ ఫారం పూరించి మ్యాపింగ్ చేయడంలో సంపూర్ణ సహకారాన్ని అందచేయడం జరిగిందన్నారు.



## రెజొనెన్స్ స్కూల్ వీ.డి.వోస్ కాలనీ లో మెహందీ వేడుకలు




**ఖమ్మం, జులై 30, నేటి శుభోదయ :** ఖమ్మం వీ.డి.వోస్ కాలనీలో గల రెజొనెన్స్ పాఠశాలలో చిన్నారుల కోసం మెహందీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్లో బాలికలు ఒకరి చేతికి ఒకరు అందమైన మెహందీ డిజైన్లను వేసుకున్నారు. వివిధ రకాల సంప్రదాయ, ఆధునిక డిజైన్లతో చిన్నారులు చేతులు కళకళలాడాయి. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు కూడా చిన్నారులకు మెహందీ వేయడంలో సహాయపడ్డారు. విద్యార్థులు తమక ఇష్టమైన డిజైన్లను ఎంచుకొని, వాటిని తమ చేతులపై వేసుకుని ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్స్ ఆర్.వి. నాగేంద్ర కూమార్, కె. శ్రీధర్ రావు మాట్లాడుతూ విద్యాపరమైన నైపుణ్యాలను మాత్రమే కాకుండా, వారిలో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికి తీయడం మా లక్ష్యం. మెహందీ ఉత్సవాలు వంటి కార్యక్రమాలు పిల్లలలో సృజనాత్మకతను, సాంస్కృతిక అవగాహనను పెంపొందిస్తాయి. మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది అని పేర్కొన్నారు. ఈ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాదు, దీని వెనుక ఎన్నో ఆరోగ్య, సామాజిక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తెలుగు సంస్కృతిలో గోరింటాకు ఆషాఢ మాసంలో ఒక ముఖ్యమైన భాగం, గోరింటాకును శుభానికి, సౌభాగ్యానికి ప్రతీకగా భావిస్తారు ఆరోగ్య ప్రయోజనాలు శరీర ఉష్ణోగ్రత నియంత్రణ, నరాల ఉపశమనం, రక్తప్రసరణ మెరుగుదల అనేక రకాల వ్యాధులను నియంత్రిస్తుందని తెలిపారు.పాఠశాల డైరెక్టర్ నీలిమ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలో నేర్చుకునే ప్రతి అంశం వారి భవిష్యత్తుకు పునాది కావాలి. ఈ మెహందీ వేడుకలు పిల్లలకు ఆనందాన్ని ఇవ్వడమే, కాకుండా, వారిలో సహకారం, సృజనాత్మకత, సామాజిక ఐక్యత వంటి విలువలను పెంపొందిస్తాయి. ప్రతి విద్యార్థి తమ బాల్యాన్ని ఆనందంగా గడపడంతో పాటు, నూతన విషయాలను నేర్చుకోవాలని కొరుకుంటున్నాము. అని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు .మెహందీ ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు.

## వస్పుల ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో మెడికల్ క్యాంపు




**మిడ్జిల్, జూలై 30, నేటి శుభోదయ :** మిడ్జిల్: మండలంలోని వస్పుల ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో డా. మీర్జా అలీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 115 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన వైద్య బృందం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, ఆరోగ్య సంరక్షణపై పలు సూచనలు చేసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది అయ్యుబ్ ఖాన్, సంపత్ కుమార్, పారిజాత, జంగయ్యతో పాటు హాస్టల్ వార్డెన్ రవికుమార్, లక్ష్మమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖమ్మం నగరంలో వర్షాకాలం దృష్ట్యా పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వీడాలి -ప్రభుత్వానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచన



**ఖమ్మం, జూలై 30, నేటి శుభోదయ :** వర్షాకాలం నేపథ్యంలో ఖమ్మం నగరంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచించారు.

నగరంలో పలుచోట్ల చెత్త పేరుకుపోవడం, మురుగు కాలువలు పూడుకుపోవడం, వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన సదుపాయాలు కల్పించి, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అన్నారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.నిల్వ నీరు ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా మందుల పిచికారీని క్రమం తప్పకుండా నిర్వహించాలని కోరారు. వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని పేర్కొన్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు పనిచేయాలని, పారిశుద్ధ్యంపై ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## భూముల విలువ పెరగడంతో దర్జాగా పార్క్ స్థలం కబ్జా..యధేచ్ఛగా అక్రమ నిర్మాణం.?.



**రాజేంద్రనగర్,జులై 30, నేటి శుభోదయ :**
భూముల విలువ పెరగడంతో పార్కులు,రోడ్డు స్థలాల సైతం అక్రమార్కుల వైనం.నార్సింగి సర్కిల్ పరిధి మార్యూ టౌన్షిప్లో ప్రజా అవసరాల కోసం కేటాయించిన పార్కు స్థలం ఆక్రమణకు గురవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.పార్కు కోసం కేటాయించిన స్థలంలో ఇనుప రేకులతో చుట్టి నిర్మాణ పనులు చేపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.దీంతో కాలనీవాసులకు అందాల్సిన పార్కు స్థలం కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తాందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి,ఆక్రమణలు తొలగించి పార్కు స్థలాన్ని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## కేశంపేటలో మహిళలకు మొక్కల పంపిణీ

### -అల్వాలలో ఘనంగా వనమహోత్సవం



**కేశంపేట, జూలై-30, నేటి శుభోదయ :**
కేశంపేట మండలంలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో హోమ్‌స్టెడ్ ప్లాంట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కేశంపేట గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ కృష్ణారెడ్డి, ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సంతోష్ తదితరులు పాల్గొని మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. ఇంటి ఆవరణలో మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని అధికారులు సూచించారు.అనంతరం అల్వాల గ్రామపంచాయతీలోని డెన్స్ ప్లాంటేషన్ ప్రాంతంలో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి మొక్కలు నాటారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో అల్వాల సర్పంచ్ శ్రీ సురేష్ రెడ్డి, ఎంపీఓ దయానంద్, ఏపీఎం అజీజ్, టీఏలు, వేజ్ సీకర్లు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాల్లో పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## వెంకట్ కు సినారె పురస్కారం.



**ఖమ్మం, జూలై-30, నేటి శుభోదయ**
ఖమ్మం నగరానికి చెందిన ఫోటోగ్రాఫర్, రచయిత వెంకట్ కు రచనా విభాగంలో సినారె పురస్కారం లభించింది.సాహితీ కళాసేవా సమితి(సాంస్కృతిక,సేవా సంస్థ)ఆధ్వర్యంలో గురుపౌర్ణమి నాడు జ్ఞానపీఠ్ డా॥ సి. నారాయణ రెడ్డి జయంతి సందర్భంగా,సినారె సాహితీ పురస్కారాలు – 2026పురస్కార కార్యక్రమం హైదరాబాద్ నగరం నందు నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమం లో ఖమ్మం నగరానికి చెందిన టీ. వెంకట్ కు రచయిత గా కమిటీ వారు ఎన్నుకొని సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అలాగే తెలుగు రాష్ట్రాల నుండి ఆర్మీ,విద్య,సంగీతం,నృత్యం,రచనలు,కవితలు తదితర విభాగాలలో ప్రతిభను కనబరిచిన వారిని ఎన్నుకొని సాహితీ కళా సేవ సమితి,సాంస్కృతిక సేవ సంస్థ వ్యవస్థాపకులు స్వప్న కిషోర్ ఆత్మీయ అతిధుల చేతులు మీదుగా జ్ఞాపికలను అందజేశారు.

## చంద్రుగొండలో రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- **ప్రజల గుమ్మం వద్దకే సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొంగులేటి**
- **7 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం – పూరి గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం**





**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30, నేటి శుభోదయ :** ప్రజల గుమ్మం వద్దకే సంక్షేమ ఫలాలు చేరవేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార–పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో గురువారం రూ.1.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.మంత్రి ముందుగా మంగయ్య బంజార గ్రామంలో రూ.45 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు, కల్వర్టు, సీసీ రోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, గ్రామానికి 24 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు ప్రకటించారు.తదుపరి పొకలగూడెంలో రూ.60 లక్షలతో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికే గ్రామానికి 77 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, మిగిలిన అంతర్గత రహదారులను కూడా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం రావికంపాడులో రూ.20 లక్షలతో రెండు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వం భారీ అప్పులు మిగిల్చినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రెండేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయగా, మరో 16 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు.మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు రూ.70 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, అర్హులకు కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రైతు సంక్షేమ పథకాలు సమర్థంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు.ఇందిరమ్మ గృహాల పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షలు కలిపి మొత్తం 7 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. హైదరాబాద్‌కు ప్రత్యేకంగా లక్ష ఇళ్లను మంజూరు చేశామని, రాష్ట్రంలో పూరి గుడిసెలు లేకుండా ప్రతి అర్హ కుటుంబానికి శాశ్వత నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టులు, తాగునీటి సౌకర్యాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, చంద్రుగొండ మండలంలో చేపట్టిన పనులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని మంత్రి అన్నారు.ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, మంగయ్య బంజార గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మంత్రి చొరవతో మండలానికి మరిన్ని అభివృద్ధి పనులు మంజూరవుతున్నాయని తెలిపారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం సర్వే పూర్తయిందని, అర్హుల ఎంపిక పారదర్శకంగా జరుగుతోందన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం 'ఫ్రైడే–డ్రై డే' కార్యక్రమం నిర్వహిస్తూ పారిశుధ్య చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో మధు, తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, పంచాయతీ అధికారి అనూష, గృహనిర్మాణ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజల హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కుతోంది

- **రైతు, విద్యార్థి, వృద్ధుల వితంతువుల జీవితాలతో చెలగాటం**
- **మంథని బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి సామల అశోక్ ధ్వజం**




**మంథని, జూలై-30, నేటి శుభోదయ :**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పాలనను పూర్తిగా విస్మరించి రైతులు, విద్యార్థులు, వృద్ధులు, వితంతువులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని బీజేపీ మంథని పట్టణ ప్రధాన కార్యదర్శి సామల అశోక్ మండిపడ్డారు. గురువారం మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త వృద్ధాప్య పెన్షన్లు, వితంతు పెన్షన్ల మంజూరులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, అర్హులైన వేలాది మంది ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. గత ప్రభుత్వం రెండేళ్ల నిర్లక్ష్యం వల్ల, అలాగే ప్రస్తుత ప్రభుత్వం రెండున్నర ఏళ్ళ పాటు నిర్లక్ష్యం కారణంగా కొత్త పెన్షన్ దారులు నాలుగున్నర ఏళ్ళ కాలంగా అవస్థలు పడుతున్నట్లు అసహనం వ్యక్తం చేశారు.కొత్తగా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇప్పటికీ మంజూరు కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల విన్నపాలు ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు ఆలస్యం కావడంతో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకంగా మారాయని అయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అత్యంత కీలకమైన రైతు బీమా, రైతుబంధు వంటి పథకాల అమలులో కూడా ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని, రైతుల సమస్యలను గాలికొదిలేసిందని ఆరోపించారు. ముఖ్యంగా ఎల్ఐసి కి రైతు బీమాకు సంబంధించిన డబ్బులు చెల్లించకపోవడంతో మరణించిన లక్షలాది మంది రైతులకు 5 లక్షల రూపాయల బీమా డబ్బులు ఇప్పటికీ అందలేదన్నారు. పంట నష్టాలు, ఆర్థిక ఇబ్బందులతో రైతులు సతమతమవుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని, రైతులు, విద్యార్థులు, వృద్ధులు, వితంతువులను కాంగ్రెస్ ప్రభుత్వం చులకనగా చూస్తోందని సామల అశోక్ తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని కొత్త పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, రైతు బీమా, రైతుబంధు నిధులను సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు.ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కాలయాపన చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో కలిసి బీజేపీ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తుందని ఆయన హెచ్చరించారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

### : మండల వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్



**వికారాబాద్, జూలై 30, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల ముప్పు అధికంగా ఉండటంతో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కుల్కచర్ల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్ సూచించారు. మండలంలోని బండవెల్కిచెర్ల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆయన వసతి గృహం, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు.వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం గమనించాలని, వసతి గృహ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులు మూడు రోజులకుపైగా అనారోగ్యంతో బాధపడితే ఆలస్యం చేయకుండా వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి , వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# బానిసత్వానికి చరమగీతం పాడాలి33 జిల్లాల్లో 'స్వేచ్ఛ రథం'తో అవగాహన..

## బాండెడ్ లేబర్ నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ






**శామీర్‌పేట, జూలై 30, నేటి శుభోదయ :** తెలంగాణలో వెట్టిచాకిరీ (బాండెడ్ లేబర్) నిర్మూలనకు ప్రభుత్వం మరింత పకడ్బందీగా చర్యలు చేపడుతోంది. బాండెడ్ లేబర్ సిస్టమ్ అబాలిషన్ చట్టం అమలుకు 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా, ప్రపంచ మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజేఎం) సంయుక్తంగా శామీర్‌పేటలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించాయి.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ) సభ్య కార్యదర్శి చెన్నపక్షి పంచాక్షరి, నల్సార్ వీసీ కృష్ణదేవరావు కలిసి ★'స్వేచ్ఛ రథం'★ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పర్యటిస్తూ బాండెడ్ లేబర్‌పై ప్రజలకు అవగాహన కల్పించనుంది. గ్రామీణ ప్రాంతాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న దోపిడీ, బలవంతపు పనులు, హక్కులు, చట్టపరమైన రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.తెలంగాణ రైజింగ్–2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో బాండెడ్ లేబర్, ఆధునిక బానిసత్వానికి తావులేకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. కార్మికులు దోపిడీకి గురైనప్పుడు భయపడకుండా ఫిర్యాదు చేసి సకాలంలో సహాయం పొందేలా ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం పెంచాల్సిన అవసరం ఉందన్నారు.సదస్సులో 380 మందికి పైగా బాధితులు, అధికారులు, న్యాయ నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు. బాధితుల రక్షణ, విముక్తి, పునరావాసం, న్యాయం అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని వక్తలు సూచించారు."బీఎల్ఎస్ఏ చట్టం అమల్లోకి వచ్చి 50 ఏళ్లు పూర్తయినా బాండెడ్ లేబర్ కొనసాగడం ఆందోళనకరం. ఇది కేవలం న్యాయపరమైన సమస్య కాదు.. మానవ గౌరవం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలకు సంబంధించిన అంశం. పోలీస్, రెవెన్యూ, కార్మిక, మహిళా–శిశు సంక్షేమ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలి" అని టీఎస్ఎల్ఎస్ఏ సభ్య కార్యదర్శి చెన్నపక్షి పంచాక్షరి తెలిపారు. గ్రామాల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలతో పాటు మొబైల్ వాహనాల ద్వారా లఘుచిత్రాలు ప్రదర్శిస్తూ ప్రజలకు హక్కులపై చైతన్యం కల్పిస్తున్నట్లు చెప్పారు."ఫిర్యాదుతో మొదలై.. రక్షణ, విముక్తి, పునరావాసంతో చర్యలు కొనసాగాలి. జిల్లా విజిలెన్స్ కమిటీలు మరింత క్రియాశీలంగా పనిచేయాలి. బాధితులను కేవలం రక్షించడం కాకుండా స్థిరమైన జీవనోపాధి కల్పించాలి. లేదంటే వారు తిరిగి దోపిడీ బారినపడే ప్రమాదం ఉంది" అని నల్సార్ వీసీ కృష్ణదేవరావు అన్నారు.ఐజేఎం జాతీయ కార్యక్రమ డైరెక్టర్ మెర్లిన్ ఫ్రీడా మాట్లాడుతూ.. బీఎల్ఎస్ఏ చట్టం ద్వారా ఐదు దశాబ్దాల క్రితమే రుణం పేరుతో వ్యక్తి స్వేచ్ఛను హరించరాదనే స్పష్టమైన సందేశం ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం రాతి గనులు, ఇటుక బట్టీలు, బియ్యం మిల్లులు తదితర ప్రాంతాల్లో కార్మికులు దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. అవగాహనను కార్యాచరణగా మార్చి, బాండెడ్ లేబర్ నిర్మూలనకు సమష్టి కృషి అవసరమన్నారు.పాట.. నాటకంతో చైతన్యసదస్సులో ★'బాండెడ్ లేబర్ అవగాహన గీతం'★ను గాయకుడు, గేయరచయిత, తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక–పర్యాటక సలహా కమిటీ సభ్యుడు పల్లె నరసింహ ఆలపించారు. అనుమానాస్పద బాండెడ్ లేబర్ కేసులను గుర్తించి కార్మిక శాఖ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని పాట ద్వారా పిలుపునిచ్చారు.అలాగే 'బీఎల్ఎస్ఏ చట్టానికి 50 ఏళ్లు' పేరుతో రూపొందించిన పుస్తకాన్ని, బాండెడ్ లేబర్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌తో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు. వీటిని ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృతంగా ప్రదర్శించనున్నారు.సదస్సులో బాండెడ్ లేబర్ నుంచి విముక్తి పొందిన బాధితులు తమ అనుభవాలను వివరించారు. అమరగిరి పంచాయతీ అధ్యక్షురాలు, బాధితురాలు పి. లింగమ్మ మాట్లాడుతూ.. గతంలో తాను ఎదుర్కొన్న బానిసత్వాన్ని గుర్తుచేసుకుంటూ, ప్రస్తుతం ఇతరులు ఇలాంటి బాధలు పడకుండా వారికి అండగా నిలుస్తానని తెలిపారు. అధికారుల సహకారంతో తమ జీవితాల్లో మార్పు వచ్చిందని, కష్టాల్లో ఉన్న పేదలకు తాను సాయం చేస్తానని చెప్పారు.గజ్వేల్లి ప్రతాప్ సాంస్కృతిక బృందం ప్రదర్శించిన నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. బాండెడ్ లేబర్‌లో చిక్కుకున్న వారి వేదన, విముక్తి కోసం సాగిన పోరాటం, పునరావాసం తదితర అంశాలను నాటకం ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు.బాండెడ్ లేబర్ నిర్మూలనకు ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ, స్వచ్ఛంద సంస్థలు, విద్యావేత్తలు, స్థానిక సంస్థలు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని సదస్సు పిలుపునిచ్చింది.

# సిపిఐ గద్దెను కూల్చడం పిరికిపందల చర్య

- ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం
- సిపిఐ నగర కార్యదర్శి జానిమియా



**ఖమ్మం, జూలై 30, నేటి శుభోదయ :** సిపిఐ పార్టీ గద్దెను కూల్చడం పిరికిపందల చర్య అని ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య –స్ఫూర్తికి విరుద్ధమని సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్ కె జానిమియా తెలిపారు. ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్ వైఎస్ఆర్ నగర్ కాలనీలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏర్పాటు చేసిన పార్టీ గద్దెను బుధవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. విషయం తెలిసిన వెంటనే సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఏఐటియుసి ఆటో స్టాండ్ ఉపాధ్యక్షులు షేక్ అక్రమ్, ఖానాపురం హవేలీ సహాయ కార్యదర్శి ఆముదాల వెంకన్న తదితరులు ఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగర కార్యదర్శి జానిమియా మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను తీవ్రంగా దెబ్బతీసేవిధంగా సిపిఐ పార్టీ గద్దెను అర్ధరాత్రి వేళ –అక్రమంగా కూల్చివేయడం అత్యంత ఖండనీయమన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి –విరుద్ధమన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, పోలీస్ అధికారులను కోరారు. ప్రజల్లో ఉద్రిక్తతలు సృష్టించే చర్యలకు ఎవరు పాల్పడవద్దని శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కూల్చివేసిన చోటే సిపిఐ పార్టీ గద్దెను తిరిగి ఏర్పాటు చేయాలని జానిమియా డిమాండ్ చేశారు.

# బోనాల పండుగకు బారీ పోలీసు బందోబస్తు -మైలార్దేవ్ పల్లి ఇన్స్పెక్టర్ సీ హెచ్.శ్రీనివాస్

**రాజేంద్రనగర్,జులై 30, నేటి శుభోదయ :** మైలార్దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 2వ తేదీ ఆదివారం నాడు జరిగే ఆషాడం మాసం బోనాల ఉత్సవాలకు అన్ని ప్రాంతాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఇన్స్పెక్టర్ సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు.అన్ని వర్గాల ప్రజలు కుల మతాలకు అతీతంగా సోదర భావం,భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకోవాలని ఆయన సూచించారు.ఇందులో భాగంగానే ఆదివారం జరిగే బోనాల ఉత్సవాలను ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎల్లవేళలా పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు.ప్రధానంగా భక్తులు అమ్మవారి ఆలయాల ఆధ్యాత్మిక వాతావరణాన్ని వెల్లి విరిసేలా భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు.బోనాలు జరిగే ఆలయాల వద్ద తగిన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు పత్రికా ముఖంగా వెల్లడించారు.ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు మఫ్టీ పోలీసులు,ఇతర ప్రత్యేక పోలీసులచే నిఘా ఉంటుందన్నారు.ఎక్కడైనా అనుమానిత వ్యక్తులు గానీ,వాహనాలు కానీ సంచరించినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయాల్ 100 నంబర్ కు సమాచారం అందించాలని సూచించారు.ఇప్పటికే బోనాల పండుగ బందోబస్తు పై తమ పోలీసు సిబ్బందికి తగ్గిన సూచనలు చేయడం జరిగిందన్నారు.శాంతి భద్రతల పరిరక్షణ,ప్రజా శ్రేయస్సు తమకు ముఖ్యమన్నారు.పండుగ వేళల్లో ఎవరు కూడా అతిగా మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు.పోలీసు ఉన్నతాధికారుల ఆదేశానుసారం తమ పోలీసు సిబ్బంది విధులను నిర్వహిస్తారన్నారు. ఇక రౌడీషీటర్లు జాగ్రత్తగా ఉండాలి.పండుగల వేళ రౌడీషీటర్లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా,శాంతి భద్రతలకు



ఆటంకం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగినట్లు తెలిస్తే నేరుగా తనకు సమాచారం అందించవచ్చునన్నారు.

# మదర్ థెరిసా ఆశ్రమాని సందర్శన దేవి మానస



**ఖమ్మం, జూలై 30, నేటి శుభోదయ :** న్యాయ సేవా సంస్థ ( డీఎల్ఎస్ఏ ) కార్యదర్శి పి. దేవి మానస మదర్ థెరిసా నిరాశ్రయుల ఆశ్రయ గృహాన్ని సందర్శించి అక్కడి ఆశ్రయితలతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రయ గృహంలో కల్పిస్తున్న వసతులను పరిశీలించి, నిర్వాహకులతో మాట్లాడి ఆశ్రయితలకు అవసరమైన సేవలు మరింత మెరుగ్గా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఆమె నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో అమలులో ఉన్న వివిధ పథకాలు, ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు నాల్సా పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ, అవసరమైన వారికి జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించేందుకు తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆశ్రయ గృహ సిబ్బంది పాల్గొన్నారు.

# పలువురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి,షాదీముభారక్ చెక్కుల పంపిణీ



**సంగారెడ్డి, జూలై 30, నేటి శుభోదయ :** సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ లోని రైతువేదిక లో గురువారం మండలంలోని 41మంది లబ్ధిదారులకు మంజూరు అయిన 41,04,756/–రూపాయల కళ్యాణ లక్ష్మీ ,షాదీముభారక్ చెక్కులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య,తహశీల్దార్ ఆశాజ్యోతి,నాయబ్ తహశీల్దార్ నరేష్,మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దన్న పాటిల్,మండల నాయకులు, ప్రజాప్రతినిధులు,ఆయా గ్రామాల సర్పంచ్ ల చేతులమీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జి.అంజయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల ద్వారా లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతుందని అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి సమర్ధవంతంగా చేరవేయడమే లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కేదారినాథ్ పాటిల్,వీరభద్రేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి,మాజీ పిఏసిఎస్ చైర్మన్ నాగిశెట్టి పాటిల్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాలాజీ నర్సింలు,రాయికోడ్ సర్పంచ్ రాధ తుకారాం,అల్లాపూర్ సర్పంచ్ చరణ్ కుమార్,మాజీ చైర్మన్ నజీర్,మాజీ యువత అధ్యక్షుడు విదర్శన్ రెడ్డి,యూత్ మాజీ అధ్యక్షుడు ప్రభాకర్,వివిధ గ్రామాల సర్పంచ్‌లు,మాజీ సర్పంచ్‌లు,ప్రజాప్రతినిధులు,నాయకులు మరియు అధికారులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# 2వ తేదీన రేణుక ఎల్లమ్మతల్లి బోనాల మహోత్సవం



**సంగారెడ్డి, జూలై 30, నేటి శుభోదయ :** సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ శివారులో వెలసిన రేణుక ఎల్లమ్మతల్లి బోనాల మహోత్సవాన్ని ఆగస్టు 2వ తేదీ ఆదివారం నిర వ్యహించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ బోనాల మహోత్సవంలో అందరూ త ప ్పకుండా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి బోనాల మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.అలాగే ఆలయ సన్నిధిలో శనివారం రాత్రి భజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

## గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించిన భద్రాద్రి సాంస్కృతిక వారధి





**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30, నేటి శుభోదయ :** భద్రాచలం పట్టణంలోని జీయర్ మఠంలో భద్రాద్రి సాంస్కృతిక వారధి ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు, అధ్యక్షులు చల్లా కొండలరావు నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంగీత, నృత్య, సాంస్కృతిక రంగాలకు విశిష్ట సేవలందిస్తున్న స్థానిక గురువులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, గురువు కేవలం విద్యను బోధించే వ్యక్తి మాత్రమే కాకుండా విలువలు, సంస్కారం, వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శి అని పేర్కొన్నారు. భారతీయ గురు–శిష్య పరంపరను పరిరక్షించడంలో కళా గురువుల పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్ గోళ్ళ భూపతి రావు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు ఆర్. రామకృష్ణ రెడ్డి, ఉప్పాడ రామ్ ప్రసాద్ రెడ్డి, పామరాజు తిరుమలరావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జశ్వంత్ ప్రసాద్, పోస్టల్ నాగేశ్వర రావు హాజరై గురువులకు గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. కళా గురువుల సేవలు సమాజానికి చిరస్మరణీయమని, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించడంలో వారి కృషి అమూల్యమని పేర్కొన్నారు.అనంతరం నిర్వహించిన సంగీత, నృత్య సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, భక్తులు, పట్టణ ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు.కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన భద్రాద్రి సాంస్కృతిక వారధి అధ్యక్షులు చల్లా కొండలరావును అతిథులు ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు గురు–శిష్య సంప్రదాయాన్ని మరింత బలోపేతం చేస్తాయని ఆకాంక్షించారు.

## తెలంగాణ యూనివర్సిటీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా ఎం.సుధాకర్



**నిజామాబాద్, జూలై 30, నేటి శుభోదయ :** తెలంగాణ యూనివర్సిటీ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం యూనివర్సిటీలో నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షులుగా ఎం.సుధాకర్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అదేవిధంగా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షులు సురేష్,ప్రధాన కార్యదర్శి బికోజి,ఉపాధ్యక్షులు,సహాయ కార్యదర్శులు,అడ్వైజర్,ఆర్గనైజ్ సెక్రెటరీ,ఎగ్జిక్యూటివ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షునిగా ఎన్నుకోబడిన ఎం.సుధాకర్ కి ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ శుభాకాంక్షలు తెలిపారు.

## పేకాటలో పట్టుబడిన కానిస్టేబుల్ ను సస్పెండ్ చేసిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం, జూలై 30, నేటి శుభోదయ :** జులై 19న వేంసూర్ మండలం అమ్మపాలెం గ్రామ శివారు ప్రాంతంలో కంచర్ల వెంకటేశ్వరరావు అలియాస్ జయం, శ్రీహరి అనే ఆర్గనైజర్ల ఆద్వర్యంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరం పై వేంసూర్ ఎస్సై కవిత, పోలీస్ సిబ్బంది దాడి చేసి 22 మంది పై కేసు నమోదు చేశారు. దాడిలో ఏఆర్ కానిస్టేబుల్ (డ్రైవర్ సత్తుపల్లి టౌన్ పిఎస్) మహమ్మద్ ఇమ్రాన్ షరీఫ్ కూడా పట్టుబడ్డారు. దీంతో విధినిర్వహణలో నిర్లక్ష్యం, శాఖా పరమైన నియమాలను ఉల్లంఘించిన కారణంగా నిందితుడైన కానిస్టేబుల్ మహమ్మద్ ఇమ్రాన్ షరీఫ్ ను సస్పెండ్ చేస్తూ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఉత్తర్వులు జారీచేశారు.

## భారతదేశంలో ప్రజాస్వామ్యానికి అవకాశం కుంచించుకుపోతోందిజస్టిస్ ఉజ్జల్ భూయాన్

**వనపర్తి, జులై 30, నేటి శుభోదయ :** భిన్నాభి ప్రాయాలపై ఆంక్షల నేపథ్యంలో భారతదేశంలో ప్రజాస్వామ్యానికి అవకాశం కుంచించుకు పోతోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అన్నారు.స్పష్టంగా చట్టవిరుద్ధం కాని చర్యలకు నిరసనకారులు అరెస్టులు, భావప్రకటనా స్వేచ్ఛపై ఆంక్షలను ఎదుర్కొంటున్నందున భారత దేశ ప్రజాస్వామ్య పరిధి కుంచించుకు పోతోందని జస్టిస్ భూయాన్ హెచ్చరించారు.భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యతిరేక గళం విప్పే అవకాశం తగ్గిపోతోందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ అన్నారు. నిరసన తెలిపేందుకు, తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు ఉన్న ప్రాథమిక హక్కులను వినియోగించుకుంటున్న విద్యార్థులు, కార్యకర్తలు, సాధారణ పౌరులను నేరస్థులు గా పరిగణిస్తు న్నారని ఆయన అన్నట్లు లైవ్ లా నివేదించింది.భోపాల్ లోని నేషనల్ లా ఇన్స్టిట్యూట్ యూనివర్సిటీ (NLIU)లో జరిగిన 5వ జస్టిస్ జి.పి. సింగ్ మెమోరియల్ లెక్చర్ లో మాట్లాడుతూ, జస్టిస్ భూయాన్, శాంతియుత చర్చ, భిన్నాభి ప్రాయాలు ప్రజాస్వామ్యానికి సారాంశ మని, అయితే వాటిని అరెస్టులు, సుదీర్ఘ జైలు శిక్షలు, కఠినమైన బెయిల్ షరతులతో ఎక్కువగా ఎదుర్కొంటున్నారని అన్నారు.“సేవలో ఉన్న ఒక భారత సైనికాధి కారిని ‘ఉగ్రవాది కుమార్తె’ అని పిలిచిన మంత్రి ప్రవర్తనపై ఫేస్‌బుక్ లో పోస్ట్ పెట్టినందుకు, అతనిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. అతను ముందస్తు బెయిల్ కోరవలసి వచ్చింది. బెయిల్ మంజూరైంది. కానీ కోర్టు ఏం చేస్తుంది? అతను పారిపోయే ప్రమాదం కూడా లేనప్పుడు, అతని పాస్‌పోర్ట్ ను డిపాజిట్ చేయమని అడుగుతుంది. (ఆ తర్వాత ఫేస్‌బుక్ లో ఏమీ పోస్ట్ చేయవద్దు అని చెబుతుంది)” అని జస్టిస్ భూయాన్ అన్నట్లు లైవ్ లా పేర్కొంది.క్యాంపస్ లలో నిరసన తెలుపుతున్న విద్యార్థులకు సుదీర్ఘకాలం పాటు బెయిల్ ను నిరాకరిస్తున్న ఉదంతా లను ఆయన ప్రశ్నించారు. భావప్రకటనా స్వేచ్ఛను అణచి వేసే బెయిల్ షరతులను విధిస్తున్నందుకు కోర్టులను విమర్శించారు. ఇఫ్తార్ కోసం గంగానదిలో పడవ పై గుమిగూడిన యువకుల కేసును ప్రస్తావిస్తూ, “గంగానది పై చికెన్ తినడాన్ని నిషేధించే చట్టం ఏదీ లేదు. సరిగ్గా అదే కారణంతో వారిని అరెస్టు చేసి, మూడు నెలల పాటు జైలులో ఉంచాల్సి వచ్చింది. ఇలాంటి చర్యకు పాల్పడి నందుకు ప్రజలను అరెస్టు చేసి, మూడు నెలల పాటు బెయిల్ నిరాకరించ వచ్చా అని నన్నే నేను ప్రశ్నించుకుంటున్నాను! పౌరులు గమనిస్తున్నారు, ప్రజలు గమనిస్తున్నారు” అని ఆయన అన్నారు.ముంబైలో పాలస్తీనా అనుకూల ప్రదర్శనకు అనుమతి నిరాకరించ డాన్ని న్యాయమూర్తి మరింతగా విమర్శిస్తూ, విశ్వవిద్యా లయాలు విద్యార్థుల క్రియాశీలతను శిక్షించేవి గా కాకుండా, విమర్శనాత్మక ఆలోచన, చర్చలను ప్రోత్సహించే వేదికలుగా ఉండాలని అన్నారు.“భారత్ పాలస్తీనా ను గుర్తించింది. భారతదేశంలో పాలస్తీనా రాయబార కార్యాలయం ఉంది. సంప్రదాయబద్ధంగా, భారత్ ఎల్లప్పుడూ పాలస్తీనా ను గుర్తిస్తూ నే వచ్చింది. అయినప్పటికీ అక్కడ జరుగుతున్న దానికి వ్యతిరేకంగా, అది ఒక జాతి నిర్మూలన అని ప్రకటించాలని కోరుతూ దక్షిణాఫ్రికా నే అంతర్జాతీయ న్యాయ స్థానాన్ని ఆశ్రయించింది. గాజాలోని హింసపై విచారణ జరిపేందుకు ఐక్యరాజ్య సమితి, ఒరిస్సా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మురళీధర్ ను నియమించింది. ప్రభుత్వం పిల్లలు, మహిళలు, వృద్ధులపై జరిపిన హింస గురించి ఆయన ఒక నివేదికను సమర్పించారు. దానిని ఐక్యరాజ్యసమితి ఆమోదించింది. అది ఇప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంది,” అని జస్టిస్ భూయాన్ సభికులకు తెలిపారు.గాజా విషయమై, భారతదేశం వెలుపల జరుగు



తున్న సంఘటనలపై ప్రజలు ఎందుకు నిరసన తెలపాలని కోరుకుంటున్నారని ఒక న్యాయమూర్తి ప్రశ్నించడం తనకు “చాలా వినోదా త్మకంగా” అనిపించిందని ఆయన అన్నట్లు బార్ అండ్ బెంచ్ నివేదించింది.అధికారాల విభజన సూత్రం గురించి ప్రస్తావిస్తూ, పదవీ విరమణ చేసిన న్యాయ మూర్తులు పదవి నుంచి వైదొలిగిన వెంటనే రాజకీయాల్లోకి ప్రవేశించడం పట్ల జస్టిస్ భూయాన్ హెచ్చరించారు. అటువంటి చర్యలు న్యాయవ్యవస్థ, కార్య నిర్వాహక వ్యవస్థ మధ్య ఉన్న రాజ్యాంగ పరమైన వ్యత్యాసాన్ని మసక బారుస్తాయని ఆయన అన్నారు. కాల పరీక్షకు నిలిచిన తీర్పుగా అభివర్ణిస్తూ, సుప్రీంకోర్టు చారిత్రాత్మక కేశవానంద భారతి తీర్పును ఆయన సమర్థించారు. అదే సమయంలో, దాని న్యాయశాస్త్ర పరమైన చట్ట బద్ధతను ప్రశ్నిస్తున్న బహిరంగ వ్యాఖ్యలను విమర్శించారు.“ఒకే చోట రెండు కాళ్లు ఉంటే, బల్ల కూలిపోతుంది. ఇది ప్రాథమిక సూత్రం. అందువల్ల, న్యాయవ్యవస్థ, కార్య నిర్వాహక వ్యవస్థ మధ్య అంతరాన్ని పూడ్చేందుకు తాను రాజ్యసభకు వెళ్తున్నానని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి చెప్పడం ప్రాథమికంగా తప్పు. ఇది అధికారాల విభజన సూత్రాలకు విరుద్ధం,” అని ఆయన అన్నట్లు బార్ అండ్ బెంచ్ నివేదించింది.

## పుట్టుకతోనే నవజాత శిశువులో గుర్తించిన అరుదైన అండాశయ సిస్టుకు విజయవంతమైన శస్త్రచికిత్స

- **మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యుల అరుదైన వైద్య విజయం**



**రాజేంద్రనగర్,హైదరాబాద్,జులై 30, నేటి శుభోదయ :** గర్భధారణ సమయంలో లేదా పుట్టిన వెంటనే నవజాత శిశువుల పొత్తికడుపులో కనిపించే కొన్ని గడ్డలు అరుదైన పుట్టుకతో వచ్చే వ్యాధులకు సంకేతాలుగా ఉండొచ్చు.వాటిలో నవజాత శిశువుల అండాశయ సిస్టు (నియోనాటల్ ఒవేరియన్ సిస్ట్) ఒకటి.తల్లి హార్మోన్ల ప్రభావం వల్ల కొంతమంది ఆడ శిశువుల్లో ఈ సమస్య ఏర్పడుతుంది.చిన్న సిస్టులు చాలాసార్లు స్వయంగా తగ్గిపోతాయి.అయితే పెద్ద సిస్టులు ఉంటే అండాశయం మెలిక తిరగడం (ఒవేరియన్ టర్షన్),పగిలిపోవడం,రక్తస్రావం,ఇన్ఫెక్షన్,అండాశయం శాశ్వతంగా దెబ్బతినడం వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది.అందువల్ల సకాలంలో గుర్తించి నిపుణులైన వైద్యులతో చికిత్స అందించడం అత్యంత కీలకం.ఇటీవల మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో పుట్టుకతోనే ఎడమ అండాశయంలో పెద్ద సిస్టుతో జన్మించిన ఒక ప్రీటర్మ్ ఆడ శిశువుకు వైద్యులు విజయవంతంగా చికిత్స అందించారు.అల్ట్రాసౌండ్ పరీక్షల్లో శిశువు పొత్తికడుపులో పెద్ద పరిమాణంలో ఉన్న ఎడమ అండాశయ సిస్టు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో,భవిష్యత్తులో తలెత్తే తీవ్రమైన సమస్యలను నివారించడంతో పాటు అండాశయాన్ని సంరక్షించాలనే లక్ష్యంతో బహుళ విభాగాల వైద్యుల బృందం శస్త్రచికిత్స నిర్వహించింది.అత్యాధునిక శస్త్రచికిత్స విజయవంతం..కన్సల్టెంట్ పీడియాట్రిషియన్,నియోనాటాలజిస్ట్ డా.ప్రశాంత్ బాబు బి నేతృత్వంలో జనరల్ అనస్థీషియా కింద లాపరోటమీ ద్వారా అండాశయ సిస్టు మార్సుపియలైజేషన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు.శస్త్రచికిత్స ముఖ్యాంశాలు..పుట్టుకతో ఉన్న పెద్ద అండాశయ సిస్టును విజయవంతంగా తొలగించారు.పొత్తికడుపు అవయవాలపై ఏర్పడిన ఒత్తిడిని తొలగించారు.అండాశయ కణజాలాన్ని సాధ్యమైనంత వరకు సంరక్షించారు.బయాప్సీ పరీక్షల్లో ఇది హానికరం కాని (బోనిజ్ఞ్) ఫాలిక్యులర్ సిస్టు అని నిర్ధారించారు.ఎలాంటి ప్రధాన సమస్యలు లేకుండా శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది.నవజాత శిశువుకు సమగ్ర వైద్య సేవలు..శస్త్రచికిత్స అనంతరం శిశువుకు నియోనేటల్ ఐసీయూలో నిపుణుల పర్యవేక్షణలో సమగ్ర వైద్య సేవలు అందించారు.సోడియం లోపం (హైపొనట్రిమియా) సరిచేశారు.క్రమంగా తల్లిపాలను ప్రారంభించి పూర్తి స్థాయిలో అందించారు.పొత్తికడుపు పరిస్థితిని నిరంతరం పరిశీలించారు.ఇన్ఫెక్షన్ రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు.బహుళ విభాగాల వైద్యుల సమన్వయంతో చికిత్స కొనసాగించారు.విజయవంతమైన ఫలితం..సకాలంలో చికిత్స అందడంతో శిశువు ఆరోగ్యంగా కోలుకుంది.శస్త్రచికిత్స అనంతరం ఎలాంటి ప్రధాన సమస్యలు తలెత్తలేదు.తల్లిపాలను బాగా స్వీకరించింది.సోడియం స్థాయిలు పూర్తిగా సాధారణ స్థితికి చేరుకున్నాయి.తదుపరి అల్ట్రాసౌండ్ పరీక్షల్లో సిస్టు పూర్తిగా తొలగినట్లు నిర్ధారణ అయింది.శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అనుకూల పరిస్థితి ఏర్పడింది.వైద్యుల సూచనలతో ఆరోగ్యంగా ఇంటికి పంపించారు.వైద్యుల అభిప్రాయం ఈ సందర్భంగా కన్సల్టెంట్ పీడియాట్రిషియన్,నియోనాటాలజిస్ట్ డా.ప్రశాంత్ బాబు బి మాట్లాడుతూ.."నవజాత ఆడ శిశువుల్లో పెద్ద అండాశయ సిస్టులు అరుదుగా కనిపిస్తాయి.అయితే సకాలంలో గుర్తించకపోతే అండాశయం మెలిక తిరగడం,పగిలిపోవడం లేదా శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉంది.నిపుణులైన నియోనేటల్ సంరక్షణ,సరైన సమయంలో శస్త్రచికిత్స అందిస్తే శిశువులు పూర్తిగా కోలుకుని సాధారణంగా ఎదుగుతారు" అని తెలిపారు.ఈ కేసు ప్రత్యేకత..నవజాత ఆడ శిశువులో అరుదైన అండాశయ సిస్టును సకాలంలో గుర్తించడం.శస్త్రచికిత్స ద్వారా తీవ్రమైన సమస్యలను నివారించడం.అండాశయ పనితీరును సంరక్షించడం.బయాప్సీ ద్వారా ఇది క్యాన్సర్ కాదని నిర్ధారించడం.గర్భధారణ సమయంలో నిర్వహించే స్కానింగ్‌లు,పుట్టిన వెంటనే చేసే నవజాత శిశు పరీక్షల ప్రాముఖ్యతను చాటిచెప్పడం.బహుళ విభాగాల వైద్యుల సమన్వయంతో అత్యాధునిక వైద్య సేవలు అందించగల సామర్థ్యానికి నిదర్శనంగా నిలవడం.యశోదా హాస్పిటల్స్ యాజమాన్యం స్పందన..గర్భధారణ సమయంలో నిర్వహించే స్కానింగ్‌లు,పుట్టిన వెంటనే చేసే నవజాత శిశు పరీక్షల ద్వారా అనేక పుట్టుకతో వచ్చే లోపాలను ముందుగానే గుర్తించి విజయవంతంగా చికిత్స అందించవచ్చని యశోదా హాస్పిటల్స్ యాజమాన్యం తెలిపింది.ఈ సందర్భంగా ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్,యూనిట్ హెడ్ కె.శ్రీనివాస్ రెడ్డి,అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ..అత్యాధునిక ఇమేజింగ్ సదుపాయాలు, నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు,అనుభవజ్ఞులైన పీడియాట్రిక్ సర్జన్లు,నియోనాటాలజిస్టులు, అనస్థీషియా నిపుణులు,బహుళ విభాగాల వైద్యుల సమన్వయంతో నవజాత శిశువులకు ప్రపంచ స్థాయి వైద్య సేవలను యశోదా హాస్పిటల్స్ అందిస్తున్నాయని తెలిపారు.పుట్టుకతో వచ్చే లోపాలను సకాలంలో గుర్తించి నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించడం ద్వారా దీర్ఘకాలిక సమస్యలను నివారించడంతో పాటు శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బాటలు వేయవచ్చని వారు పేర్కొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తం

## - జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**సంగారెడ్డి, జులై 30, నేటి శుభోదయ :** కంట్రోల్ రూమ్ నెంబర్ 08455-276155సంగారెడ్డి, జూలై 30:- భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ప్రజల నుండి అందే అత్యవసర ఫిర్యాదులు, సమాచారం, నష్టం వివరాలను వెంటనే స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు చేరవేసి తక్షణ చర్యలు తీసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ప్రజలు భారీ వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు, వరదలు, రహదారి అంతరాయాలు, చెట్లు కూలిపోవడం, విద్యుత్ సమస్యలు లేదా ఇతర ప్రమాదాలకు సంబంధించిన సమాచారాన్ని 08455-276155 నంబర్‌కు వెంటనే తెలియజేయాలని తెలిపారు.కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించదానికి సిబ్బందిని మూడు షిఫ్టుల్లో నియమించామని, అందిన ప్రతి ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత తహసీల్దార్‌కు వెంటనే పంపించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లాలోని రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ప్రజలు అవసరం లేనప్పుడు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాగులు, చెరువులు, వరద నీటి ప్రవాహాల వద్దకు వెళ్లరాదని, అధికార యంత్రాంగం జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.



# మున్సిపల్ నిర్లక్ష్యంతోనే రామగుండంలో వరద పరిస్థితులు

## -ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్



**మంథని/రామగుండం, జూలై 30, నేటి శుభోదయ :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వర్షాకాలానికి ముందే చేపట్టాల్సిన చర్యలను విస్మరించడంతోనే నగరంలో వరద పరిస్థితులు ఏర్పడ్డాయని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ ఆరోపించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన మురుగు కాలువలు, డివిజన్లలోని డ్రైనేజీలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలలో పూడికను ముందస్తుగా తొలగించకపోవడం వల్ల వర్షపు నీరు సక్రమంగా వెళ్లక నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయని తెలిపారు. వర్షాలు కురిసిన తర్వాత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం వల్ల సమస్యకు పరిష్కారం లభించదని విమర్శించారు. ప్రధాన కాలువల వెంట అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే వర్షపు నీటిని నిల్వ చేసే చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికావడంతో వరద నీరు నివాస ప్రాంతాల్లోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రామగుండంలో ప్రత్యేకంగా "హైడ్రా" తరహా వ్యవస్థను ఏర్పాటు చేసి చెరువులు, కుంటలు, కాలువల ఆక్రమణలను తొలగించాలని, భవిష్యత్తులో వరద ముప్పును నివారించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని మద్దెల దినేష్ కోరారు.

# పెరుగుతున్న ఆర్థిక అంతరాలు

## - కమ్యూనిస్టుల బలోపేతమే దేశానికి రక్ష

**బోనకల్, జులై 30, నేటి శుభోదయ :** మోడీ పాలన తీరుతో దేశంలో ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని, ఈ పరిణామం దేశ భవిష్యత్ పై తీవ్ర పరిణామం చూపుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. కార్పోరేట్ శక్తులు, దేశ సంపదను తమ గుప్పిట పడుతున్నారని ఆయన ఆరోపించారు. సిపిఐ మధిర, బోనకల్, చింతకాని మండలాల శిక్షణా తరగతులు గురువారం స్థానిక ఎస్ఆర్ కళ్యాణ మండపంలో గురువారం జరిగాయి. ముందుగా ప్రారంభ సూచికంగా పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు ఆవిష్కరించారు. బత్తినేని నీరజ ప్రిన్సిపాల్ గా వ్యవహరించిన ఈ శిక్షణా తరగతుల్లో హేమంతరావు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చేనాడు వందల కోట్లకు పరిమితమైన వారు, దశబ్దకాలంలో వేల, లక్షల కోట్లకు పడగలేత్తారన్నారు. ఆదానీ రూ.800 కోట్లకు పడగలెత్తారని, మోడీ నిర్ణయాలు చాలా వరకు, ఆదానీ కన్నునన్నల్లోనే తీసుకుంటారని హేమంతరావు ఆరోపించారు. ఇప్పుడు ఒక శాతం మంది ధనవంతుల చేతిలో 99 శాతం సంపద కేంద్రీకృతమైనదని అన్నారు. మోడీ పాలన ప్రజలను విస్మరించి సాగుతుందని, ప్రైవేట్ రంగం విరాజిల్లుతుందని హేమంతరావు తెలిపారు. ప్రధానమైన వ్యవసాయ రంగం, సంక్షోభంలో కూరుకుపోతుందని, నిరుద్యోగం పెరిగి పోతుందని, అల్పాదాయ వర్గాల సంఖ్య గణనీయంగా పెరగడం దేశంలో అశాంతికి కారణమవుతుందని అన్నారు. ఇదే సమయంలో మతోన్మాద శక్తులు ఈ దేశాన్ని భక్తి ముసుగులో విచ్ఛిన్నం దిశగా తీసుకెళ్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోను ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని, కాంగ్రెస్ కేవలం మాటలకే పరిమితవుతున్నారన్నారు. ఇచ్చిన హామీలు అమలుకాకపోవడంతో ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. ప్రస్తుత పరిస్థితిలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని, ఇందుకు అనుగుణంగా పార్టీ నిర్మాణ కర్తవ్యాలను నిర్వర్తించాలని అన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సంసిద్ధులను చేయాలని అన్నారు. శాఖ నిర్మాణం పటిష్టంగా ఉండడంతో పాటు కార్యకర్తలను నిరంతరం పార్టీ కార్యక్రమాలలో పాల్గొనే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలని హేమంతరావు సూచించారు. పార్టీ ప్రచారం , ప్రజా ఆందోళనలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ మాత్రమే సామాజిక, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందని హేమంతరావు తెలిపారు. ఈ శిక్షణ తరగతులలో పార్టీ కర్తవ్యాలు, ప్రచారం అనే అంశాన్ని జిల్లా కార్యదర్శి దండి సురేష్, భారత జాతీయ ఉద్యమం, కమ్యూనిస్టు పార్టీ పాత్ర అనే అంశాన్ని జమ్ముల జితేందర్ రెడ్డి, కులం, మతం, వర్గపోరాటం అనే అంశాన్ని సింగు నరసింహారావు, ప్రపంచీకరణ, దాని ప్రభావం అనే అంశాన్ని ఏనుగు వెంకటేశ్వరరావు బోధించారు. ఈ శిక్షణ తరగతులలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవింద రావు, ఏపూరి రవీంద్రబాబు, తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబు, ఏనుగు గాంధీ, పావులూరి మల్లికార్జున రావు, ఎంఏ రహీం, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, దూసరి గోపాలరావు, జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, జక్కుల రామారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, ఆకెన పవన్ పలువురు సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# వ్యాస పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించిన బీజేపీ ధార్మిక సెల్

**ఖమ్మం, జూలై 30, నేటి శుభోదయ :** వ్యాస పౌర్ణమి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగరంలోని భారతీయ జనతా పార్టీ ధార్మిక సెల్ కార్యాలయంలో బీజేపీ ఖమ్మం జిల్లా ధార్మిక సెల్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం, వేద పండితుల సన్మానం, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ హిందూ ధార్మిక విలువల పరిరక్షణలో ధార్మిక సెల్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా ధార్మిక సెల్ కమిటీలను విస్తరించి, ప్రతి మండలం, ప్రతి గ్రామ స్థాయిలో సంస్థను బలోపేతం చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ధార్మిక సెల్ కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ మారుతి వీరభద్ర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మార్గదర్శకత్వంలో అన్ని మండలాలు, పట్టణాల్లో ధార్మిక సెల్ కమిటీలను ఏర్పాటు చేసి హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు.గురు పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం బ్రహ్మశ్రీ వడ్లమాని లక్ష్మీనారాయణ అవధాని, బ్రహ్మశ్రీ ఐతపు వెంకటేశ్వర్లు శర్మ, బ్రహ్మశ్రీ ఎడవల్లి సత్యంబాబు శర్మ, బ్రహ్మశ్రీ మర్ల సీతారామయ్య, అవధానుల రామ్మోహన్ శర్మ, ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకుడు నాళ్ల రంగారావు, 94 ఏళ్ల మాతృమూర్తి మార్తి లీలావతిని నూతన వస్త్రాలు సమర్పించి శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ధార్మిక సెల్ కో-కన్వీనర్లు పసుమర్తి సంతోష్, దారుకుమల్లి లక్ష్మి రెడ్డి, జాయింట్ కన్వీనర్లు సూర విష్ణు, బండారు శ్రీనివాసరావు, గుర్రాల నాగేందర్, మరింగంటి శేషమణి, మార్తి శేష ఫణికుమార్, మార్తి విశాలి, చల్లా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ హక్కుల సాధన సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గ సమావేశం

**రాజేంద్రనగర్, జులై30 , నేటి శుభోదయ :** రాజేంద్రనగర్ మండల కార్యాలయం ఏ ఆర్ దేవరాజ్ భవన్ లో జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సిపిఐ మాజీ కార్యదర్శి,సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు హాజరయ్యారు.ఈ సమావేశం బీసీ హక్కుల సాధన సమితి రాజేంద్రనగర్ మండల ఇంచార్జ్ జే ఆనంద్ గౌడ్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశ ఉద్దేశించి బీసీ హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య,సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు మాట్లాడుతూ..స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా తమాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి అని మరియు వార్షిక బడ్జెట్లో ప్రతి వార్షిక సంవత్సరము 50% బడ్జెట్ బీసీలకు కేటాయించాలని వారు అన్నారు.చట్టసభలో పార్లమెంట్ అసెంబ్లీలలో బీసీలకు జనాభా తమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి.ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి అని ఐదు శాతం జనాభా లేని వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పించడం వలన బీసీలకు అత్యధికంగా నష్టపోతున్నారు.కావున ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్లను పునర్ పరిశీలించాలి అని వాళ్లు అన్నారు టిజిపిఎస్ సి 29 జీవోను రద్దు చేయాలి మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు 50% శాతం సబ్ కోట కేటాయించాలి అని వారు అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో నూతన కమిటీలను ఎన్నుకోవడం జరిగింది.రాజేంద్రనగర్ మండలం బీసీ హక్కుల సాధన సమితి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.గౌరవ అధ్యక్షులుగా జే ఆనంద్ గౌడ్ అధ్యక్షులు జె సదానంద గౌడ్ ఉపాధ్యక్షులు గుజ్జరీ శ్రీరాములు ప్రధాన కార్యదర్శి కె మనోజ్ సహాయ కార్యదర్శిగా కె మౌనిక తో పాటు15 మందితో కమిటీని ఎన్నుకోవడం జరిగింది.బీసీ హక్కుల సాధన సమితి గండిపేట్ మండల అధ్యక్షులుగా ఆర్ శ్రీనివాస్ ని ప్రధాన కార్యదర్శిగా ఎం గోపాల్ తో పాటు 11 మందితో కమిటీ ఎన్నుకోవడం జరిగింది.బీసీ హక్కుల సాధన సమితి శంషాబాద్ మండల అధ్యక్షులుగా డి శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శిగా కావలి మల్లేష్ తో పాటు 11మందితో కమిటీ ఎన్నుకోవడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో సిపిఐ శంషాబాద్ కార్యదర్శి నరగిరి,గండిపేట కార్యదర్శి మల్లేష్,రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె విజయ్ ఆనంద్ గౌడ్,కన్యగారి లక్ష్మి ,మునేశ్వరి,జి సత్యం గంగారం శాలిని,జ్యోతి, మధు తదితరులు పాల్గొన్నారు.



# ఆషాడ మాస బోనాల మహోత్సవాలకు

## సబితా ఇంద్రా రెడ్డికి ఆహ్వానం : ఎస్.వెంకటేష్



**రాజేంద్రనగర్,జులై 30, నేటి శుభోదయ :** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధి ఉమ్మడి మైలార్దేవపల్లి డివిజన్ లో ఆగస్టు 2వ తేదీ ఆదివారం జరగనున్న ఆషాడ మాస బోనాలకు కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ తో పాటు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు,శ్రీనగర్ కాలనీలో మాజీ మంత్రి,మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి,రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి నివాసములో మర్యాదపూర్వకంగా కలిసి,రానున్న అమ్మవారి బోనాల మహోత్సవాలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.సబితా ఇంద్రా రెడ్డి,కార్తీక్ రెడ్డిలను ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరిస్తూ,బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన గొప్ప ఆధ్యాత్మిక ఉత్సవమని అన్నారు.అమ్మవారి కృపాకటాక్షాలతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని,ప్రజలందరూ ఆయురారోగ్యాలు,సుఖశాంతులు,ఐశ్వర్యాలతో విలసిల్లాలని ఆకాంక్షిస్తూ,అమ్మవారి బోనాల మహోత్సవాలు తప్పకుండా ఇరువురు హాజరవుతామని,విజయవంతం కావాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆక్యం రాఘవేంద్ర యాదవ్,మైసిరెడ్డి,క్రాంతి,మహేందర్,శాంతిరాజ్,అఖిల్,నిఖిల్,నితిన్,చిరు,పవన్,అనిల్,చిన్న,కున్సి సోనుతో పాటు యువకులు పాల్గొన్నారు.

## యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత కోచింగ్ ను బీసీ యువత సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- అర్హులైన ప్రతి బీసీ అభ్యర్థి గడువులోగా లాంగ్ టర్మ్ కోచింగ్ కు దరఖాస్తు చేసుకోవాలి
- యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత లాగ్ టర్మ్ కోచింగ్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, జులై30, నేటి శుభోదయ :** ప్రభుత్వం ప్రతిభావంతులైన బీసీ యువతకు కల్పిస్తున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత కోచింగ్ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకుని, అత్యున్నత సివిల్ సర్వీసుల లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు.గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో టీజీ బీసీ స్టడీ సర్కిల్, ఖమ్మం ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 దీర్ఘకాలిక ఉచిత కోచింగ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి పరిపాలనలో ప్రతిభావంతులైన యువత భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూర్తి ఉచితంగా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ కోచింగ్‌ను అందిస్తూ, బీసీ విద్యార్థులకు అండగా నిలుస్తోందన్నారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన యువత కూడా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత సర్వీసులను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగేందుకు ఈ కోచింగ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 2026, ఆగస్టు 24 నుంచి 2027, మే నెల వరకు పూర్తిగా ఉచిత కోచింగ్ అందించనున్నట్లు తెలిపారు. నాణ్యమైన బోధనతో పాటు, కోచింగ్ సామగ్రి, గ్రంథాలయ సదుపాయం, కరెంట్ అఫైర్స్ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకుల శిక్షణ, రెగ్యులర్ పరీక్షలు, మాక్ టెస్టులు, వ్యక్తిత్వ వికాస శిక్షణ, ఇంటర్వ్యూ మార్గదర్శకత్వం వంటి అన్ని సౌకర్యాలు ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా కల్పిస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వం కోచింగ్ కార్యక్రమానికి మొత్తం 150 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వీరిలో 100 మందిని ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష ద్వారా, మరో 50 మందిని ఇప్పటికే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి ఎంపిక చేయనున్నట్లు వివరించారు.ఎంపికైన అభ్యర్థులకు స్టైపెండ్, అదనంగా ఒకేసారి పుస్తకాల గ్రాంట్ అందజేస్తామని అన్నారు. ఈ ఆర్థిక ప్రోత్సాహకాలు విద్యార్థులు పూర్తిస్థాయిలో పోటీ పరీక్షలపై దృష్టి కేంద్రీకరించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన విద్యార్థులకు కూడా ఈ సమాచారాన్ని చేరవేసేందుకు అధికారులు ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని, యువత పట్టుదలతో శ్రమిస్తే అత్యున్నత లక్ష్యాలను తప్పకుండా చేరుకోగలరని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, బీసీ,ఎస్సి, ఎస్టీ వర్గానికి చెందినవారై ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ 2026 ఆగస్టు 7 వరకు కొనసాగుతుందని, ఆగస్టు 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష, ఆగస్టు 19న ఫలితాలు, ఆగస్టు 21 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఆగస్టు 24 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అర్హతలు, ఎంపిక విధానం, దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలను టీజీ బీసీ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి జి. జ్యోతి, డైరెక్టర్ బీసీ స్టడీ సర్కిల్ గోన శ్రీలత, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి మాధవి, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటేష్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, టీజీ బీసీ స్టడీ సర్కిల్ ప్రతినిధులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏసీఐ వరల్డ్ ఎయిర్‌పోర్ట్ కస్టమర్ ఎక్స్పీరియన్స్ ప్రోగ్రామ్లో లెవల్-5 అక్రెడిటేషన్ను సాధించిన జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం



**రాజేంద్ర నగర్,30 జూలై, నేటి శుభోదయ :** జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్),ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) వరల్డ్ ఎయిర్‌పోర్ట్ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ అక్రెడిటేషన్ ప్రోగ్రామ్ కింద అత్యున్నత గుర్తింపైన లెవల్–5 అక్రెడిటేషన్ను సాధించింది.ఈ గుర్తింపుతో,కస్టమర్ అనుభవాన్ని తమ కార్పొరేట్ వ్యూహం,కార్యాచరణలో అత్యుత్తమత,భాగస్వామ్య సహకారానికి కేంద్రబిందువుగా మలిచిన ప్రపంచంలోని ప్రతిష్టాత్మక విమానాశ్రయాల సరసన హైదరాబాద్ విమానాశ్రయం నిలిచింది.లెవల్–5 అక్రెడిటేషన్ అనేది పూర్తి స్థాయిలో సమగ్రంగా రూపుదిద్దుకున్న కస్టమర్ అనుభవ వ్యవస్థను కలిగి ఉన్న విమానాశ్రయాలకు అందజేయబడుతుంది.ఇందులో ప్రయాణికుల అంచనాలే వ్యూహాత్మక నిర్ణయాలు,కార్యాచరణలో అత్యుత్తమత,ఆవిష్కరణలు,విమానాశ్రయ పరిసర వ్యవస్థలోని అన్ని భాగస్వామ్య సంస్థల మధ్య సహకారానికి మార్గదర్శకంగా నిలుస్తాయి.ఈ స్థాయిలో కస్టమర్ అనుభవం ఒక ప్రత్యేక కార్యక్రమంగా కాకుండా, విమానాశ్రయ కార్పొరేట్ వ్యూహానికి మూలస్తంభంగా మారి,ప్రయాణికులకు నిరంతరాయమైన,సమర్థవంతమైన,చిరస్మరణీయమైన ప్రయాణ అనుభవాన్ని అందించేందుకు అన్ని భాగస్వాములు సమిష్టిగా కృషి చేస్తారు.ఈ అక్రెడిటేషన్ ద్వారా,ప్రయాణికుల అవసరాల అవగాహన,వ్యూహాత్మక సమన్వయం,పాలనా విధానం,విమానాశ్రయ సంస్కృతి,విమానాశ్రయ భాగస్వామ్య వ్యవస్థ సహకారం,సేవల రూపకల్పన,ఆవిష్కరణ,కార్యాచరణ మెరుగుదల,పనితీరు కొలమానాలు వంటి కీలక అంశాల్లో,జీహెచ్ఐఏఎల్ అవలంబిస్తున్న సమగ్ర విధానానికి గుర్తింపు లభించింది.ప్రయాణికుల రోజువారీ అనుభవాలతో వ్యూహాత్మక,కార్యాచరణ పనితీరు సూచికలను అనుసంధానించడం ద్వారా ప్రపంచ స్థాయి సేవలను అందించాలనే తన నిబద్ధతను హైదరాబాద్ విమానాశ్రయం మరింత బలోపేతం చేస్తోంది.ఈ సందర్భంగా జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సీఈఓ కదిర్ కదిర్వన్ మాట్లాడుతూ.."ఏసీఐ వరల్డ్ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ లెవల్–5 అక్రెడిటేషన్ సాధించడం హైదరాబాద్ విమానాశ్రయాన్ని నిజమైన కస్టమర్ కేంద్రిత ప్రపంచ స్థాయి విమానయాన కేంద్రంగా తీర్చిదిద్దే మా ప్రయాణంలో ఒక కీలక మైలురాయి.కస్టమర్ అనుభవాన్ని మా కార్పొరేట్ వ్యూహానికి పునాదిగా మలచాలనే మా అచంచల నిబద్ధతకు ఇది నిదర్శనం. ప్రయాణికులకు సులభమైన,సహజమైన,చిరస్మరణీయమైన ప్రయాణ అనుభవాలను అందించేందుకు మా విమానాశ్రయ పరిసర వ్యవస్థలోని అన్ని భాగస్వాములు సమిష్టిగా చేసిన కృషికి ఇది గుర్తింపు.సహకారం,ఆవిష్కరణ,నిరంతర అభివృద్ధి సంస్కృతిని మేము విజయవంతంగా పెంపొందించుకున్నామనే విషయాన్ని ఇది ప్రతిబింబిస్తుంది." అని తెలిపారు."ప్రయాణికుల అంచనాలు నిరంతరం మారుతున్న నేపథ్యంలో,సాంకేతికత,డేటా ఆధారిత విశ్లేషణలు,సేవల ఆవిష్కరణలను వినియోగించి సమర్థవంతమైన,అందరికీ అందుబాటులో ఉండే,వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన మరియు ప్రపంచ ప్రమాణాలకు అనుసరించే సేవలను అందించేందుకు మేము కట్టుబడి ఉన్నాం.ఈ గుర్తింపు మమ్మల్ని మరింత ఉన్నత ప్రమాణాలను నెలకొల్పేందుకు ప్రేరేపించడమే కాకుండా, ప్రపంచంలోని అగ్రశ్రేణి విమానాశ్రయాల సరసన హైదరాబాద్ విమానాశ్రయం స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది," అని ఆయన పేర్కొన్నారు.ఏసీఐ వరల్డ్ ఎయిర్‌పోర్ట్ కస్టమర్ ఎక్స్పీరియన్స్ అక్రెడిటేషన్ ప్రోగ్రామ్ అంతర్జాతీయ ఉత్తమ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన సమగ్ర మూల్యాంకన విధానం ద్వారా విమానాశ్రయాల కస్టమర్ అనుభవ నిర్వహణ పరిపక్వతను అంచనా వేస్తుంది.ఈ కార్యక్రమంలో అత్యున్నత గుర్తింపైన లెవల్–5 అక్రెడిటేషన్,కస్టమర్ అనుభవాన్ని సంస్థ వ్యూహాత్మక దృష్టి,పాలనా వ్యవస్థ,కార్యాచరణ విధానాలు,సంస్థాగత సంస్కృతిలో పూర్తిస్థాయిలో అంతర్భాగంగా మలిచిన విమానాశ్రయాలకు ప్రదానం చేయబడుతుంది.అలాగే,ఆవిష్కరణలు,డేటా ఆధారిత విశ్లేషణలు మరియు కొలిచే ఫలితాల ఆధారంగా ప్రయాణికుల అనుభవాన్ని నిరంతరం మెరుగుపరచేందుకు అన్ని భాగస్వామ్య సంస్థలు సమిష్టిగా పనిచేసే సమగ్ర విమానాశ్రయ పరిసర వ్యవస్థకు ఇది ప్రతీకగా నిలుస్తుంది.

## మండల స్థాయి సమీక్ష సమావేశం.. గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని సీఈఓ కృష్ణారెడ్డి సూచన



**కేశంపేట, జులై30, నేటి శుభోదయ :** కేశంపేట మండలంలో మండల స్థాయి సమీక్ష సమావేశం ఏడీఏ రమాదేవి, మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి రంగారెడ్డి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి అధికారి శ్రీ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మండలంలోని గౌరవ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో మండలంలోని అన్ని శాఖల ప్రగతి, అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచులు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని, కొత్త పనులు చేపట్టడంతో పాటు సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. దీనిపై విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఈశ్వర్‌కు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ,,, ప్రతి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు. అలాగే 16వ ఆర్థిక సంఘం నిధులు, వీబిజి రాంజీ పథకం విధివిధానాలను వివరించారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.మండల ప్రత్యేక అధికారి రమాదేవి మాట్లాడుతూ,,వర్షపాతం తక్కువగా ఉన్న పరిస్థితుల్లో రైతులు పంటల మార్పిడి చేపట్టాలని, నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.సీఈఓ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సర్పంచులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. అధికారులు గ్రామాలను తరచూ సందర్శిస్తూ సర్పంచులతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో విద్యుత్, తాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఫారం పాండ్లు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు చేపట్టి వర్షపు నీటిని భూమిలో నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ దయానంద్, ఎంఈఓ చంద్రశేఖర్, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, ఆరోగ్య, వ్యవసాయ, పశుసంవర్ధక, ఐసీడీఎస్, అటవీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి అభివృద్ధికి రూ.1,700 కోట్లు : ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి




**తలకొండపల్లి, జూలై 30, నేటి శుభోదయ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్వకుర్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.1,700 కోట్లకు పైగా నిధులను తీసుకువచ్చినట్లు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.నియోజకవర్గంలోని గ్రామాలను విడతల వారీగా అభివృద్ధి పథంలోకి నడిపిస్తామని ఆయన స్పష్టం చేశారు.రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీతారావమ్మ అధ్యక్షతన మండల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులతో కలిసి మండలంలోని సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నియోజకవర్గానికి తీసుకొచ్చిన నిధులతో ప్రతి గ్రామంలో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. వీటితో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, ప్రజల సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.మండలాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, అందరూ కలిసికట్టుగా గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో మండల పరిధిలోని సర్పంచులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఆయా శాఖల ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జూలపల్లి జనప్రభంజనం.. కదలివచ్చిన ఊరు.. కదిలిన (ఎంపిడిఓ) ఆఫీస్!

- **సమస్యల పరిష్కారం కోసం జూలపల్లి గ్రామస్థుల 'ఛలో (ఎంపిడిఓ) ఆఫీస్'**
- **పాదయాత్రగ్రామ ఐక్యత చాటిన అశేష జనవాహిని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అధికారులకు వినతిపత్రం అందజేత**





**తలకొండపల్లి, జూలై 30, నేటి శుభోదయ :** సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న తమ గ్రామాన్ని రక్షించుకునేందుకు,రైతాంగ సంక్షేమం కోసం జూలపల్లి గ్రామ ప్రజలు ఏకతాటిపైకి వచ్చారు.తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామం నుంచి తలకొండపల్లి మండలాభివృద్ధి అధికారి (ఎంపిడిఓ)కార్యాలయం వరకు శనివారం నిర్వహించిన 'ఛలో (ఎంపిడిఓ) ఆఫీస్' పాదయాత్ర అశేష జనవాహిని మధ్య అత్యంత విజయవంతంగా సాగింది. పాలకుల నిర్లక్ష్యంపై ఊరంతా ఒక్కటై కదనరంగంలోకి దూకినట్లుగా సాగిన ఈ నిరసన ప్రదర్శన మండలంలో చర్చనీయాంశంగా మారింది.గ్రామ సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్, ఉపసర్పంచ్ ఇంద్రకంటి శ్రీశైలం గౌడ్ అగ్రభాగాన నిలిచి నడిపించిన ఈ పాదయాత్రలో వందలాది మంది గ్రామ పెద్దలు,రైతులు,యువకులు, మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. వార్డు సభ్యులు వి. సుమిత్ర – రాఘవేందర్ ముదిరాజ్, బి. శోభ – అశోక్ ముదిరాజ్, జి. అల్లాజీ గౌడ్, జి. జగదీశ్ గౌడ్,పాత్లావత్ ఉనెమ్మ –లస్కర్ తదితరులు గ్రామ ప్రజలతో కలిసి అడుగులు వేశారు.గ్రామాభివృద్ధే ధ్యేయంగా సాగిన ఈ యాత్రలో అడుగడుగునా ప్రజలు సంఘీభావం ప్రకటించారు.అనంతరం కల్వకుర్తి శాసనసభ్యులు (ఎమ్మెల్యే) కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు తలకొండపల్లి (ఎంపిడిఓ) సీతారావమ్మ ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.వినతిపత్రంలోని ముఖ్య డిమాండ్లు ఇవే..రెవెన్యూ తిప్పలకు చరమగీతం పాడాలి:జూలపల్లి పరిధిలోని సర్వే నంబర్లు 150, 155, 159, 160, 161, 162, 195, 196, 203 భూములకు సంబంధించి గత కొన్నేళ్లుగా రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి నోచుకోక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయిన రైతులకు తక్షణమే భూ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.నరకప్రాయంగా మారిన రహదారికి మోక్షమెప్పుడు?:జూలపల్లి గ్రామాన్ని గట్టిఇప్పలపల్లి గ్రామంతో కలిపే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని,గుంతలమయంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ప్రయాణించే రైతులు, విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,వర్షాకాలంలో ప్రమాదాలు పొంచి ఉన్నందున అత్యవసరంగా నూతన నల్లమందు (బీటీ) రహదారిని నిర్మించాలని కోరారు.పరిశీలించి న్యాయం చేస్తాం:ఎమ్మెల్యే కసిరెడ్డిగ్రామస్తుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించిన శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి,(ఎంపిడిఓ) అధికారులు సానుకూలంగా స్పందించారు.గ్రామంలోని భూ సమస్యలు,రహదారి దుస్థితిని సంబంధిత ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి,యుద్ధప్రాతిపదికన పరిష్కారమయ్యేలా గట్టి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి స్పష్టమైన హామీ లభించడంతో జూలపల్లి గ్రామ నాయకులు,ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ పాదయాత్ర విజయవంతంగా ముగిసింది.

# ఫీజుల బకాయి – బీజేపీ లడాయి



**ఇబ్రాహీంపట్నం, జూలై 30, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా,15,000 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తూ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న తీరును తీవ్రంగా ఖండిస్తూ, బీజేపీ యువ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ పిలుపు మేరకు ఈరోజు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ దత్త ఇంజనీరింగ్ కళాశాలలో "ఫీజుల బకాయి,బీజేపీలడాయి"కార్యక్రమాన్ని సుమారు 1,000 మంది విద్యార్థుల పాలొనికతో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ వన్నవాడ రవీందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ, వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బకాయిల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వందలాది విద్యాసంస్థలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు పుప్పాల శాంతి కుమార్, బీజేవైఎం మున్సిపల్ అధ్యక్షులు కంబాలపల్లి శశిధర్ రెడ్డి, ఆదిభట్ల మున్సిపల్ అధ్యక్షులు వినయ్, శ్రీకాంత్, సందీప్, సంతోష్, టిల్లు, అర్జున్ తో పాటు బీజేవైఎం జిల్లా, మండల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శిగా సి.వై. పుల్లయ్య

## -వైరా డివిజన్ కమిటీ కార్యదర్శి గా ఎస్కే లాల్మియా





**వైరా , జులై 30, నేటి శుభోదయ :** సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శిగా కామ్రేడ్ సి.వై. పుల్లయ్యను ఏకగ్రీవంగా నిన్న జరిగిన ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం ఎన్నుకున్నదనిపార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. స్థానంలో సుదీర్ఘకాలంగా ఉ ద్యమంలో కొనసాగుతున్న, విద్యార్థి, యువజన, ప్రజా ఉద్యమాలలో 3 దశాబ్దాల కాలంగా పనిచేస్తున్న సి.వై. పుల్లయ్యను రాష్ట్ర బాధ్యుల సమక్షంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నదన్నారు . అలాగే వైరా డివిజన్ కార్యదర్శిగా ఎస్.కె లాల్ మియాను నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. ఇప్పటి దాకా కొనసాగిన కే అర్జున్ రావు అనారోగ్యం రీత్యా రిలీవ్ చేయటం జరిగిందన్నారు. జూలై 29వ తేదీ బుధవారం వైరాలో విక్రమ్ భవనంలో వైరా డివిజన్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎలదండి బాబు అధ్యక్షతన జరిగింది. సమావేశం జిల్లాలో రైతాంగం, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న పరిస్థితులను చర్చించింది. జిల్లాల ప్రజా ఉద్యమ నిర్మాణానికి అనేక కార్యక్రమాలు తీసుకున్నదన్నారు . రాష్ట్ర కార్యదర్శిపోటురంగారావు మాట్లాడుతూరేవంత్ రెడ్డి ప్రభుత్వం 3 సం॥రాల క్రితం ఇచ్చిన వాగ్దానం ప్రకారం వృద్ధాప్య, వితంతు తదితర పెన్షన్లు వెంటనే పెంచాలన్నారు . అలాగే వ్యవసాయ కార్మికులకు, ఆటో కార్మికులకు ఇస్తానన్న పెన్షన్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసిందన్నారు .కేంద్ర ప్రభుత్వం జంతర్ మంతర్లో లో, దేశంలోని ఇతర ప్రాంతాలలో ఉద్యమంలో పాల్గొన్న వారిపై కేసులు పెట్టడం, అరెస్టులకు పూనుకోవడం దుర్మార్గమైన చర్యయన్నారు . కేసులన్ని ఎత్తివేస్తామని ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలన్నారు . కేసులనువుపసంహరించుకోవాలి. అరెస్టులను ఆపాలన్నారు . అలానే ఉద్యమకారులపై విచక్షణా రహితంగా చేసిన అమానుష హింసాకాండపై స్వతంత్ర్య న్యాయమూర్తుల బృందంతో విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారన్నారు .రాష్ట్రంలో ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలన్నింటిని తక్షణమే విడుదల చేయాలన్నారు . బకాయిలు ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో, కళాశాలల భవితవ్యంతో ఆడుకోవడం సరైంది కాదని , పాత బకాయిలు ఇస్తూనే, ఫీజు రీయంబర్స్మెంట్ ఏ ఏడాదికి ఆ ఏడాది ఇచ్చే విధానం పకడ్బందీగా అమలులోకి తీసుకురావాలన్నారు రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించకపోవడం విద్యాశాఖపై వున్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు . యూనివర్సిటీల నుంచి ప్రభుత్వబడుల దాకా తీవ్ర నిధుల కొరత, సమస్యలతో సతమతమవుతున్నాయి. సౌకర్యాలుశిథిలమవుతున్నాయిఇప్పటికేవేలబడులుమూసివేశారన్నారు . విద్యాశాఖను ఒక ముఖ్యమైన భాగంగా తీసుకొని, తగిననిధులుకేటాయించాలన్నారు .తెలంగాణా ఉద్యమకారుల గుర్తింపును పారదర్శకంగా చేయాలన్నారు . పైరవీలకు తావివ్వరాదు. అలానే ఉద్యమకారులనుఎ.బి.సి.డిలుగా వర్గీకరించి వారికి ప్రభుత్వ పథకాన్ని వర్తింప చేయాలి. తక్షణమే అమలుచేయాలన్నారు ఖమ్మం జిల్లాలో మిగిలిన పోడుభూములన్నింటికి పట్టాలుఇవ్వాలన్నారు .గోదావరి జలాలను పాలేరు వరకు మళ్ళించేలా చర్యలు తీసుకోవాలన్నారు .సమావేశంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైవ్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రామయ్య, డివిజన్ నాయకులు పాశం అప్పారావు, బండారు భద్రయ్య, కొండే వెంకటేశ్వర్లు, ఎస్కే జానీ, గోగుల సోములు, వడ్డే సత్యం, చింతల వెంకటేశ్వర్లు, కేదర్గయ్య,రాపోలు కృష్ణ, గుగులోతు శివ, గండికోట లక్ష్మణ్,తాళ్లశ్రీనుమేడికొండలరావు, సనప రాంబాబు, తదితరులు పాల్గొనారు

# సిపిఎం తొలితరం నాయకులు షేక్.అబ్దుల్ రహెమాన్ కన్నుమూత



**వైరా , జూలై 30, నేటి శుభోదయ :** పాలడుగు వాస్తవ్యులు, సిపిఎం తొలితరం నాయకులు షేక్. అ బ్దుల్ రహెమాన్ (80) వృద్ధాప్యం అనారోగ్యంతో బాధపడుతు కన్నుమూశారు. గత కొంత కాలంగా లివర్ సమస్యతో బాధపడు తున్న రహెమాన్ గురువారం హైబిపికి గురై అస్వస్థతకు లోనయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం బాధితుడిని హుటాహుటీన ఖమ్మం తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్న క్రమంలో ఆయన మృత్యువాత పడ్డారు. మృతుడు అబ్దుల్ రహెమాన్ కు భార్య జమాల్ బి, మహబూబ్ సుభాని, అబ్దుల్ వహాబ్ అనే ఇద్దరు కుమారులు, ఫాతిమున్ అనే ఒక కుమార్తె ఉన్నారు. అబ్దుల్ రహెమాన్ అంత్యక్రియలు శుక్రవారం బంధు మిత్రులు, పార్టీ శ్రేణులు నడుమ జరుగనున్నాయి.

# శంషాబాద్ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షునిగా గౌత వివేకానంద గుప్తా ఏకగ్రీవం



**రాజేంద్ర నగర్, జూలై 30, నేటి శుభోదయ :** ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షునిగా గౌత వివేకానంద గుప్తాని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈవిషయంలో ప్రస్తుత అధ్యక్షులు చింతల నందకిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొలిటికల్ కమిటీ కోశాధికారి చింతల రామకృష్ణ గుప్తా,మాజీ అధ్యక్షులు పంపాటి గౌరీ శంకర్ గుప్తా,ఎడవల్లి రాజేశ్వర్ గుప్తా,కొత్త ధర్మ గుప్త,అర్థం మధు గుప్తా,పొద్దుటూరు మహేందర్ గుప్తా పొట్టి,రమేష్ గుప్తా,నల్లవెల్లి శీను,తర్లపల్లి విజయరావ్ గుప్తా,కనిగెలుపుల సుబ్బారావు,కొత్త కృష్ణ గుప్తా పొట్టి,శేఖర్ పొట్టి,కృష్ణ, బొంగుల ప్రేమ్,ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.అనంతరం చిత్తనూరు శేఖర్ గుప్తా,సోమ సర్వేశ్వర గుప్తా ధన్యవాదాలు తెలిపారు.

# నల్మాసు ప్రభాకర్‌కు 'వైశ్య వైభవ రత్న' అవార్డు



**మంథని, జూలై 30, నేటి శుభోదయ :** వైశ్య సమాజ అభ్యున్నతికి గత 25 సంవత్సరాలుగా విశేష సేవలు అందిస్తున్న పెద్దపల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు నల్మాసు ప్రభాకర్‌కు ప్రతిష్ఠాత్మక 'వైశ్య వైభవ రత్న' బిరుదుతో పాటు సువర్ణ కంకణం (బంగారు కంకణం) అందజేసి ఘనంగా సత్కరించారు.మంథని పట్టణానికి చెందిన ప్రభాకర్ వైశ్య సంఘ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ విశేష గుర్తింపు పొందారు. వైశ్యులతో పాటు ఇతర సామాజిక వర్గాలకు అందిస్తున్న సేవలను గుర్తించిన హైదరాబాద్‌కు చెందిన లలిత కళా సమాఖ్య (సామాజిక–సాంస్కృతిక సేవా సంస్థ) ఆయనను అత్యున్నతమైన 'వైశ్య వైభవ రత్న' బిరుదుతో సత్కరించి, స్వర్ణ కంకణాన్ని బహూకరించింది.ఈ అవార్డుకు ప్రభాకర్ ఎంపిక కావడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ జెడ్పీటీసీ గంద్ర వెంకటరమణ రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బుచ్చన్న, యూత్ కాంగ్రెస్ నాయకుడు రావిగంటి సతీష్ తదితరులు ప్రభాకర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, సమాజ సేవకు అంకితభావంతో పనిచేస్తున్న నల్మాసు ప్రభాకర్‌కు లభించిన ఈ గౌరవం మంథని ప్రాంతానికే గర్వకారణమని కొనియాడారు

# నగరపాలక సంస్థలో అవినీతి అనకొండ

- నన్నెవరూపీకలేరు మంత్రి తనయుడు అండదండలు ఉన్నాయంటూ అవినీతి అనకొండ బింకాలు
- అవినీతి అధికారికి అండగా తాజా మాజీ కార్పొరేటర్లు
- పెట్రేగిపోతున్న అవినీతి తిమింగలం
- సస్పెన్షన్ - రివోక్ వెనుక మర్మమేంటి
- చోద్యం చూస్తున్న జిల్లా ఉన్నతాధికారులు
- సాంబయ్య కో రూల్ ఈ కంత్రి కో రూల్




**ఖమ్మం, జూలై 30, నేటి శుభోదయ :** ఖమ్మం నగరపాలక సంస్థ చరిత్రలోనే ఓ అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. నగర పాలక సంస్థలో అత్యంత అవినీతిపరుడైన అధికారిగా ముద్రపడిన అధికారి సస్పెన్షన్ ను 24 గంటల్లోపే రివోక్ చేయడం విశేషం. విపరీత పోకడలు లెక్కలేనితనం విధులలో అలసత్వం తోటి ఉద్యోగుల నుండి డైలీ మామూళ్లు వసూలు చేయటం అన్ని వెరసి అవినీతి అనకొండ గా తయారయ్యాడు. మద్యం మత్తులో విధులు నిర్వహిస్తూ కిందిస్థాయి ఉద్యోగుల ను వేధిస్తూ నిత్యం వివాదాలకు కేరాఫ్ గా మారాడు. తాజాగా జరిగిన కొన్ని ఘటనలు పరిశీలిస్తే మనోడి అవినీతి ఏ పాటిదొ ఇట్టే అర్థమవుతుంది. నగరపాలక సంస్థ పారిశుద్ధ్య వాహనాలకు సంబంధించిన డీజిల్ వ్యవహారంలో చోటు చేసుకున్న కుంభకోణం అంతా ఇంతా కాదు. డీజిల్ కుంభకోణంలో అతడే కింగ్ పిన్. అన్ని ఆధారాలు లభ్యమైన తరువాతే నగర పాలక సంస్థ కమిషనర్ అతనిని సస్పెండ్ చేయడం జరిగింది. సస్పెండ్ అయిన 24 గంటల్లోపే తిరిగి అతనిని విధుల్లోకి తీసుకోవడం వెనుక పెద్ద కదే నడిచింది. పైకి చెబుతున్నట్టు సర్ ప్రక్రియ కారణంగా అంటూ ప్రచారం జరుగుతున్నప్పటికీ మంత్రి తనయుడి అండదండలు తనకున్నాయని తనను ఎవరు పీకలేరని సదరు అవినీతి అధికారి బాహాటంగానే తోటి ఉద్యోగులు ఎదుట బింకాలు పలుకుతున్నాడు. దీనికి తోడుగా కొంతమంది తాజా మాజీ కార్పొరేటర్ లు ఈ అవినీతి అధికారికి వత్తాసు పలకడం విశేషం. సస్పెన్షన్ అయిన విషయం తెలుసుకొని సదరు కార్పొరేటర్లు కార్యాలయానికి వచ్చి అక్రమాలను సరిదిద్దే పనికి ఉపక్రమించారు. మరి కొద్ది నెలలలో కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇటువంటి అవినీతి అధికారికి తాజా మాజీలు అండగా నిలవడంపై నగర ప్రజల్లో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉత్తుత్తి సస్పెన్షన్ లా అవినీతి అధికారి సస్పెన్షన్ ఉండటం ఉన్నతాధికారుల వ్యవహార శైలిపై నగరపాలక సంస్థ ఉద్యోగుల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. డీజిల్ కుంభకోణంలో అడ్డంగా దొరికిన అవినీతి అధికారికి అండగా నిలిచిన ఆ తాజా మాజీ లకు అవినీతి అధికారి చేసిన లబ్ధి ఏంటి అనేది త్వరలోనే బయటపడనుందని ఉద్యోగులు గుసగుస లాడటం విశేషం. వరంగల్ అడ్డరోడ్డులో ఉండే బడా వ్యాపారి సైతం తాజా మాజీలతో కలిసి అవినీతి అధికారి అండగా నగరపాలక సంస్థ కార్యాలయానికి రావడం మరో విశేషం. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఏ బి సి లో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకున్న విషయంలో సైతం ఈ అవినీతి అధికారి పాత్ర కీలకం. ఇటీవల వీడియోస్ కాలనీలో జరిగిన వీధి శునకాల సామూహిక హత్యలలోనూ సదరు అవినీతి అధికారె కీలక సూత్రధారి అని స్వయంగా కార్పొరేషన్ ఉద్యోగులే బహిరంగంగా చెప్పటం విశేషం.విజిలెన్స్ అధికారులు మీ మీద దర్యాప్తు చేస్తున్నారని తనకు కప్పం కట్టాలంటూ పారిశుధ్య కార్మికులను నిత్యం బెదిరించడం ఈ అవినీతి అనకొండకు పరిపాటిగా మారింది. ఈ మధ్యకాలంలో నగరపాలక సంస్థ పారిశుద్ధ్య అధికారి సాంబయ్యను డీజిల్ దొంగతనం వ్యవహారంలో బాధ్యుని చేస్తూ సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు ఈ అవినీతి అనకొండ ను వెనకేసుకురాటం వెనుక నిజంగానే మంత్రి తనయుడి హస్తము ఉందా అన్న అనుమానాలు అటు ఉద్యోగులలోను ఇటు ప్రజలలోను వ్యక్తం అవుతున్నాయి. అత్యంత అవినీతి అధికారిగా ముద్రపడిన సదరు అవినీతి అనకొండకు మంత్రి తనయుడి భరోసా పై ప్రజలలో అసంతృప్తి వ్యక్తం అవుతుంది. అవినీతి రహిత పాలన అంటూ అవినీతిపరులకు కొమ్ము కాయడం ఏంటనె ప్రశ్నలు వినబడుతున్నాయి. ఏది ఏమైనా సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్న మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఈ అవినీతి అనకొండ విషయంలో ఏ రకంగా స్పందిస్తారో వేచి చూడాలి

## రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో లేజర్ బీమ్, స్కై బీమ్ లైట్ల వినియోగంపై అవగాహన సమావేశం

**రాజేంద్ర నగర్,జులై 30, నేటి శుభోదయ :** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం,హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో విమానాల సురక్షిత రాకపోకలకు విఘాతం కలిగించే లేజర్ బీమ్ లైట్లు,స్కై బీమ్ లైట్లు,సెర్చ్ లైట్లు,మూవింగ్ బీమ్ లైట్లు,ఇతర అధిక తీవ్రత గల కాంతి పరికరాల వినియోగాన్ని నిషేధిస్తూ,30 తేదీన డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం, శంషాబాద్ నందు అవగాహన సమావేశం నిర్వహించబడినది.ఈ సమావేశానికి తఫ్సీర్ ఇక్బాల్,ఐపీఎస్,అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్),హైదరాబాద్ అధ్యక్షత వహించగా,బి.రాజేష్,ఐపీఎస్,డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్,శంషాబాద్,ప్రదీప్ రెడ్డి,సహాయ పోలీసు కమిషనర్,ఆదిభట్ల,వి.శ్రీకాంత్ గౌడ్,సహాయ పోలీసు కమిషనర్,శంషాబాద్,జీఎంఆర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ( కోఓఓ),జీఎంఆర్ ఎయిర్‌సైడ్ భద్రతా విభాగ అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించబడినది.ఈ సమావేశానికి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లోని సుమారు 70 కన్వెన్షన్ హాళ్లు,ఫంక్షన్ హాళ్లు,బ్యాంక్వెట్ హాళ్లు,ఫామ్ హౌస్‌ల యజమానులు,నిర్వాహకులు హాజరై విమాన భద్రతకు సంబంధించిన నిబంధనలపై అవగాహన పొందినారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ..ఆకాశం వైపు ప్రసరించే లేజర్ బీమ్ లైట్లు,స్కై బీమ్ లైట్లు,సెర్చ్ లైట్లు,మూవింగ్ బీమ్ లైట్లు,ఇతర అధిక తీవ్రత గల కాంతి పరికరాలు విమాన చోదకుల దృష్టిని మరల్చడంతో పాటు తీవ్ర కాంతి ప్రతిఫలన (జిఎల్ఎ ఆర్ ఈ)కు కారణమై,విమానాల టేకాఫ్,అప్రోచ్,ల్యాండింగ్ ప్రక్రియలకు అంతరాయం కలిగించి,విమాన భద్రతకు తీవ్రమైన ముప్పును కలిగించే అవకాశం ఉన్నదని వివరించినారు.ఈ సందర్భంగా నిర్వాహకులకు క్రింది సూచనలు చేయబడినవి..లేజర్ బీమ్ లైట్లు,స్కై బీమ్ లైట్లు,సెర్చ్ లైట్లు,మూవింగ్ బీమ్ లైట్లు లేదా ఆకాశం వైపు ప్రసరించే ఇతర అధిక తీవ్రత గల కాంతి పరికరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదు.తమ ప్రాంగణాల్లో ఏర్పాటు చేసే లైటింగ్ వ్యవస్థలు విమానాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలిగించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.ఈ నిబంధనలను ఈవెంట్ నిర్వాహకులు,డెకరేటర్లు,డీజేలు,లైటింగ్ కాంట్రాక్టర్లకు తప్పనిసరిగా తెలియజేయవలెన.పోలీసు శాఖ,విమానాశ్రయ అధికారులు,సీఐఎస్ఎఫ్,డీజీసీఏ లేదా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటిసి) ఆదేశించిన వెంటనే ఇటువంటి కాంతి పరికరాల వినియోగాన్ని నిలిపివేయవలెను.నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్,1937లోని రూల్-66, డీజీసీఏ సివిల్ ఏవియేషన్ రిక్వైర్మెంట్స్ ( సిఎ ఆర్),సెక్షన్-4 (ఏరోడ్రోమ్స్),సిరీస్-బి,పార్ట్-I,పేరా-5.3.1.2,అలాగే భారతీయ న్యాయ సంహిత (బి.ఎన్.ఎస్),2023లోని సెక్షన్లు 125,223,283తో పాటు వర్తించే ఇతర చట్టాల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేయబడినది.విమాన భద్రత దృష్ట్యా రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లోని కన్వెన్షన్ హాళ్లు,ఫంక్షన్ హాళ్లు,బ్యాంక్వెట్ హాళ్లు,రిసార్టులు,ఫామ్ హౌస్‌లు,ఈవెంట్ నిర్వాహకులు,డెకరేటర్లు,డీజేలు,లైటింగ్ కాంట్రాక్టర్లు అందరూ ఈ నిబంధనలను విధిగా పాటించి,సురక్షిత విమాన రాకపోకలకు తమ వంతు సహకారం అందించాలని హైదరాబాద్ పోలీసు శాఖ విజ్ఞప్తి చేశారు.



## విద్యార్థులకు మంచి వాతావరణంలో విద్యను అందించి సురక్షిత క్యాంపస్ నిర్మాణమే లక్ష్యం : ప్రిన్సిపాల్ సి.వి.నరసింహులు

**రాజేంద్రనగర్,జులై 30, నేటి శుభోదయ :** విద్యార్థులకు మంచి వాతావరణంలో విద్యను అందించి సురక్షిత క్యాంపస్ నిర్మాణమే లక్ష్యం అని ప్రిన్సిపాల్ సి.వి.నరసింహులు తెలిపారు.గురువారం సీబీఐటీ కళాశాలలో షీల్డ్ 2.0' కార్యక్రమంలో భాగంగా పోష్ చట్టం-2013పై నిర్వహించిన అవగాహన సదస్సులో అయన సూచించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రతి విద్యాసంస్థలో సురక్షితమైన,గౌరవప్రదమైన వాతావరణం ఉండటం అత్యంత అవసరమని సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి.నరసింహులు అన్నారు.మహిళల భద్రత,లింగ సమానత్వం, చట్టపరమైన అవగాహనపై విద్యార్థులు,సిబ్బందిలో చైతన్యం పెంచేందుకు సీబీఐటీ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు.



## తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాల ఉత్సవాలు

- డిమాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- ఫరూఖ్‌నగర్ యాదవ కాలనీ బోనాల ఊరేగింపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు



**షాద్నగర్ , జులై30, నేటి శుభోదయ :** షాద్‌నగర్ పట్టణంలోని ఫరూఖ్‌నగర్ యాదవ కాలనీలో నిర్వహించిన బోనాల ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపులో భక్తులతో కలిసి పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల ఉత్సవాలను భక్తి, ఐక్యతతో నిర్వహించడం ఆనందదాయకమని ఆయన పేర్కొన్నారు. అమ్మవారి కరుణాకటాక్షాలు రాష్ట్ర, నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, గోపాల్, ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, యుగంధర్, చిన్న యాదగిరి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, చీపిరి రవి యాదవ్, బిక్షపతి, చెర్క శివ, అశోక్, బాబా ఘోరీ, మహమూద్, నవీన్, సాయి, అభిలాష్, శ్రీనివాస్ తదితరులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరద సహాయక చర్యలు ముమ్మరం చేయాలి -రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు







**మంథని/హైదరాబాద్, జూలై 30, నేటి శుభోదయ :** గోదావరిఖని, పెద్దపల్లి, రామగుండం ప్రాంతాల్లో భారీ వర్షాల నేపథ్యంలో సహాయక, పునరావాస చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, పోలీసు అధికారులతో కలిసి వరద పరిస్థితిని సమీక్షించారు. జలమయమైన కాలనీల్లో నీటిని త్వరితగతిన తొలగించడం, వీర్లపల్లి గ్రామంలోకి వరద నీరు చేరకుండా చర్యలు చేపట్టడం, వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.

# 60వ డివిజన్లో డ్రైనేజీ పనుల నిర్లక్ష్యం -ప్రమాదవశాత్తు గాయపడ్డ మహిళ

**ఖమ్మం, జూలై 30, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని 60వ డివిజన్లో రామన్నపేటలో ఇటీవల కొత్తగా డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ రహదారి పక్కన గ్రావెల్ వేయకుండా సుమారు 20 రోజులుగా అలాగే వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.డ్రైనేజీ నిర్మాణం అనంతరం రోడ్డు పక్క భాగం ఎత్తుపల్లాలు ఏర్పడి ప్రమాదకరంగా మారడం వాహనదారులు, పాదచారులు ప్రతిరోజూ ప్రమాద భయంతోనే ప్రయాణించాల్సి వస్తోందని వారు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల వల్ల ఓ మహిళ ప్రమాదవశాత్తు కిందపడగా ఆమెకు తీవ్ర గాయాలై సుమారు 20 కుట్లు వేయాల్సి వచ్చిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇదే తరహా నిర్లక్ష్యం కొనసాగితే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ పనులు పూర్తయిన ప్రాంతాల్లో గ్రావెల్ వేసి రహదారిని సమతలంగా మార్చడంతో పాటు ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**










- **సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్లో సుమారు 3,500 దరఖాస్తులు స్వీకరణ**
- **భూ రీ-సర్వేతో ఏడాదిన్నరలో రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**
- **అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు**
- **కల్లూరులో నిర్వహించిన సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి**

**ఖమ్మం, కల్లూరు , జులై 30, నేటి శుభోదయ :** ప్రజల సమస్యలను ప్రభుత్వం నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కల్లూరు డీఎన్పీ ఫంక్షన్ హాల్లో గురువారం కల్లూరు, తల్లాడ మండలాలకు సంబంధించిన సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ సత్తుపల్లి క్లస్టర్ ప్రజా దర్బార్లో మొత్తం సుమారు 3,500 దరఖాస్తులు అందాయని తెలిపారు.వాటిలో 1,800 ఇందిరమ్మ ఇళ్లకు, 500 వరకు రెవెన్యూ సమస్యలకు, 200 పెన్షన్లకు, ఇతర మిగతా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయని చెప్పారు. ఇదే విధంగా పాలేరు నియోజకవర్గ ప్రజా దర్బార్లో 25 వేల దరఖాస్తులు అందగా, వాటిలో 13 వేల దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించినవేనని తెలిపారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంత్రివర్గం సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. ఒకేసారి అందరికీ ఇళ్లు మంజూరు చేస్తే ఆర్థిక భారం పెరుగుతుందని, అందుకే దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రంపై రూ.8.5 లక్షల కోట్ల అప్పు భారం మోపినప్పటికీ పేదల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో ఎలాంటి రాజీ ఉండదన్నారు.సత్తుపల్లి, కల్లూరు ప్రాంతాల్లో గత 50 సంవత్సరాలుగా ఉన్న రెవెన్యూ సమస్యలను భూ రీ-సర్వే ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో సర్వే కొనసాగుతోందన్నారు. మరో ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వే పూర్తి చేసి శాశ్వత పరిష్కారం అందిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థలో జరిగిన అక్రమాలను వెలికితీసేందుకు విచారణ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. పేదల భూములు ఎలా కాజేయబడ్డాయో, భూముల మళ్లింపులు, ప్రభుత్వ భూముల అక్రమ బదిలీలు అన్నీ ప్రజలకు వెల్లడవుతాయని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇల్లు ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొంటూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు అందిస్తున్నామని తెలిపారు. గత యాసంగి లో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేశామని, ప్రతిపక్షాలు అనవసర రాజకీయాలు చేస్తున్నాయనివిమర్శించారు. ప్రతి ఒక్కరూ తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని బీఎల్వోలకు ఆగస్టు 3లోపు తప్పనిసరిగా అందజేసి ఓటు హక్కును పరిరక్షించు కోవాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గ ప్రజాదర్బార్లో వచ్చిన 25 వేల దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ కొనసాగుతోందని, సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్లో 3,500 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో గృహ నిర్మాణానికి సంబంధించిన దరఖాస్తులే అధికంగా ఉన్నాయని చెప్పారు.మంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి భూ సర్వే నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు 2 వేల ఎకరాల్లో సర్వే పూర్తి చేసి త్వరలో నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ప్రతి దరఖాస్తును సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.దరఖాస్తుల్లో ఫోన్ నంబర్, ఆధార్ వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని, పూర్తి సమాచారం ఉంటేనే సంబంధిత అధికారుల ద్వారా వేగంగా పరిష్కారం అందించ గలమని కలెక్టర్ సూచించారు.సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులు ప్రజల వద్దకే రావడం ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రత్యేకత అని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో భూ సర్వే వేగంగా సాగుతోందని, రెండు నెలల్లో పెండింగ్ రెవెన్యూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ధరణి వల్ల భూములు కోల్పోయిన రైతులకు భూ భారతి ద్వారా న్యాయం జరుగుతోందని పేర్కొంటూ, సత్తుపల్లి నియోజకవర్గానికి అదనంగా 1,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.ప్రభుత్వం ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల లోపు రుణ మాఫీ, విద్యార్థులకు యూనిఫాంలు, ఉచిత అల్పాహారం, వారానికి మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి జావ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.రూ.15 కోట్లతో మున్సిపల్ అభివృద్ధి పనులు, సత్తుపల్లిలో రూ.25 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, కల్లూరు మున్సిపాలిటీకి అదనంగా రూ.20 కోట్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నీరజ, కల్లూరు మునిసిపాలిటీ చైర్మన్ మోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ యాదవ రెడ్డి చేతుల మీదుగా 'స్నేహితుల దినోత్సవం' ప్రత్యేక పాట ఆవిష్కరణ



**గజ్వేల్ , జూలై 30, నేటి శుభోదయ :** సిద్ధిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో " స్నేహితుల దినోత్సవం" పురస్కరించుకుని గేయ రచయిత రాయారావు విశ్వేశ్వర రావు రూపొందించిన ప్రత్యేక పాటను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి మాట్లాడుతూ గేయ రచయిత రాయారావు విశ్వేశ్వరరావు రాసిన పాటలు ఎంతో అద్భుతంగా, శ్రోతలను ఆకట్టుకునేలా ఉన్నాయని కొనియాడారు. సమాజంలో స్నేహానికి ఉన్న విలువను, స్నేహితుల మధ్య ఉండే ప్రేమానురాగాలను చాలా చక్కగా ఈ పాటలో వర్ణించారని ప్రశంసించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.సి. రాజమౌళి, మాజీ కౌన్సిలర్ గోపాల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు గోలి సంతోష్, ఆపన్న హస్తం మిత్రబృందం సభ్యులు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కుమార స్వామి, గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య అధ్యక్షులు శంకర్ శర్మ, కోశాధికారి కృష్ణ మూర్తి శర్మ,రాజేశ్వర్,శరత్, తదితరులు పాల్గొన్నారు.

# చందన్వెల్లిలో ఘనంగా జలసిరి కార్యక్రమం ప్రారంబం



**షాబాద్ , జూలై 30, నేటి శుభోదయ :** రంగా రెడ్డి జిల్లా షాబాద్ మండలం చందన్వెల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ అపర్ణ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు కోసం ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, ప్రతి పొలంలో పంట కుంటలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రభుత్వం ఇంకుడు గుంతలకు రూ.6,500, పంట కుంటల ఏర్పాటుకు రూ.12,400 వరకు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మొక్కలు నాటి, గ్రామస్థులకు నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సర్పంచ్ నవనీత సామి, ఏఈఓ రాజేశ్వరి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, రైతులు, మహిళలు, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన విద్యార్థులు సమస్యల కోసం నిరసన.. స్పందించిన జిల్లా కలెక్టర్ గాయత్రి పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై కలెక్టర్ తక్షణ స్పందన

- **బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షులు శివనాయక్**



**వనపర్తి , జూలై 30, నేటి శుభోదయ :** వనపర్తి జిల్లా గాయత్రి పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద బస్సులు ఆపకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం ఘటనపై వెంటనే స్పందించి, విద్యార్థుల భద్రత కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి, ఇకపై విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన గౌరవనీయులైన వనపర్తి జిల్లా కలెక్టర్ గారికి ధన్యవాదాలు తెలియజేసిన బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షులు శివనాయక్ TGVP రవి యాదవ్ SFI కుమార్ SFI మల్లేష్ వీరన్న నాయక్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన ఆపరేషన్ ముస్కాన్-12 బృందం

**శేరిలింగంపల్లి , జులై30, నేటి శుభోదయ :** కెపి హెచ్ పి డివిజన్ ఆపరేషన్ ముస్కాన్–12 కార్యక్రమంలో భాగంగా మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బిక్షాటన చేస్తూ కనిపించిన బాలుడును అధికారులు గుర్తించి అదుపులోకి తీసుకుని వారి తల్లిదండ్రులను గుర్తించి వారికి అప్పగించారు. తేదీ 28/07/2026 నాడు మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలుడు అనుమానాస్పద తిరుగుతుండగా పోలీసులు, మహిళా శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో బాలుడిని రక్షించి, రంగారెడ్డి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం ఆపరేషన్ ముస్కాన్–12 బృందం చిన్నారులతో మాట్లాడి, ఎలాంటి ఆచూకీ తెలియజేయకపోవడంతో గవర్నమెంట్ బాలుర వసతి గృహంలో ఆశ్రమం కల్పించాం, ఆ తర్వాత వివిధ పోలీస్ స్టేషన్ కి బాలుని సమాచారం గురించి ఆరా తీయగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్లాపూర్ పోలీస్ స్టేషన్ లో బాలుడు మిస్సింగ్ కంప్లైంట్ రాగా 26/07/2026. ఇట్టి విషయాన్ని పరిశీలించగా తప్పిపోయిన అబ్బాయి కంప్లెంట్ బిక్షాటన చేసిన అబ్బాయిగా గుర్తించిన కేపిహెచ్ బి ఆపరేషన్ ముస్కాన్ -12 వారి కుటుంబ వివరాలను సేకరించి తల్లిదండ్రులను గుర్తించింది.చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసి, బాలల సంక్షేమాన్ని



దృష్టిలో ఉంచుకుని బాలురను వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ అనంతరం సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ఆపరేషన్ ముస్కాన్–12 బృందానికి, అల్లాపూర్ ఎస్ హెచ్ ఓ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మియాపూర్ కృష్ణయ్య, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు శ్రవణ్ కుమార్, దేవేంద్ర చారి, ఏ హెచ్ టు యు పీసీ షారూఖ్, విజయ్ భాస్కర్ రెడ్డి, మోతిలాల్, అనిల్ కుమార్, జహీదా, ఆపరేషన్ ముస్కాన్–12 బృంద సభ్యులు పాల్గొన్నారు.

## వినాయక చవితి, నిమజ్జనోత్సవాలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలి

### : రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

- **గణేష్ నిమజ్జనోత్సవాలపై కిస్మత్ పూర్ లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జోనల్ స్థాయి సమావేశం**

**రాజేంద్రనగర్ ,జులై 30, నేటి శుభోదయ :** సెప్టెంబర్ 14న ప్రారంభమయ్యే వినాయక చవితి మొదలుకొని సెప్టెంబర్ 25వ తేదీ అనంత చతుర్దశి రోజు వరకు జరిగే వినాయక నిమజ్జనోత్సవాల కు అన్ని ఏర్పాట్లు చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే, రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు టి ప్రకాష్ గౌడ్ అదికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం కిస్మత్ పూర్ లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన గణేష్ నిమజ్జనోత్సవాలపై జరిగిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వినాయక నిమజ్జనం ఊరేగింపు జరిగే అన్ని రహదారులను బాగు చేయాలన్నారు. నిమజ్జన ఊరేగింపు జరిగే ప్రాంతాలలో అడ్డంగా కరెంటు వైర్లు, చెట్లు ఉంటే వాటిని సరి చేసే విధంగా విద్యుత్, జీహెచ్ఎంసీ అధికారులు చొరవ చూపాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన లో వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కృషితో హనుమాన్ నగర్ పత్తికుంట ( వినాయక సాగర్ ) లో రాబోయే రోజుల్లో అందంగా తీర్చిదిద్దడానికి, వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయడానికి కావలసిన అన్ని ఏర్పాట్లు జరుగుతాయన్నారు. మండపాల నిర్వాహకులు శాంతియుత వాతావరణంలో ఇతరులకు ఇబ్బందులు కలకుండా ఊరేగింపు చేయాలన్నారు. పత్తి కుంట, పల్లె చెరువు వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్, అత్తాపూర్, కిస్మత్ పూర్ , బండ్లగూడ, చాంద్రాయణగుట్ట, పాతబస్తీలోని ప్రాంతాలన్నిటిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని అందుకోసం అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకు కదలాల్సిన అవసరం ఉందన్నారు. బాలాపూర్ గణేష్ నిమజ్జన ర్యాలీ రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని పాతబస్తీ రోడ్ల గూండా వెళ్తున్న నేపథ్యంలో ఆ రహదారులను కూడా బాగు చేయడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు అధికారులకు సహకరించి శాంతియుతంగా నిమజ్జనోత్సవాలు జరిగేలా చూడాలన్నారు. ఈ సంవత్సరం మీరాలం చెరువు వద్ద పనులు జరుగుతున్నందువల్ల అక్కడ నిమజ్జనాలు ఉండవన్నారు. మండపాల నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలి : రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ : వినాయక మండపాలు నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని, అలా చేసినట్లయితే బందోబస్తుకు ఇబ్బందులు ఉండవన్నారు. వినాయక చవితి, నవరాత్రులు, నిమజ్జోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మండపాల వద్ద అనుమానితులు ఎవరైనా కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.అనుమతుల పేరిట ఇబ్బందులు పెట్టవద్దు : శశిధర్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి : అనుమతుల పేరిట మండపాల నిర్వాహకులను ఇబ్బందులు పెట్టవద్దని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి



శశిధర్ అన్నారు . అనుమతులు అనే దాని బదులు ఇంటిమేషన్ ఇస్తే చాలు అని అంటే బాగుంటుందన్నారు. గణేష్ నిమజ్జోత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం అన్ని శాఖల అధికారులపై ఉందన్నారు. కిస్మత్ పూర్, పీరం చెరువు ప్రాంతాలలో నిమజ్జన పాయింట్లను పెట్టీ అన్ని సౌకర్యాలు కల్పించాలి : మాజీ మేయర్ బి మహేందర్ గౌడ్ కిస్మత్ పూర్ , పీరం చెరువు ప్రాంతాలలో నీటి సౌకర్యం ఉన్నచోట నిమజ్జన పాయింట్లు ఏర్పాటు చేసి క్రేన్ , విద్యుత్, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ బి మహేందర్ గౌడ్, గోకరి సురేష్ గౌడ్ లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. హిమాయత్ సాగర్ నుంచి వచ్చే వాహనాలను వన్ వే గా పోనివ్వాలి: వై శ్రీధర్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ హిమాయత్ సాగర్ నుంచి వచ్చే వాహనాలను కుడివైపు రోడ్డు గుండా వన్వే లో వెళ్ళేటట్లు చూడాలన్నాని భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ వై శ్రీధర్ కోరారు. పత్తికుంట వైపు ఉన్న రోడ్డులో కేవలం వినాయక నిమజ్జనోత్సవాల వాహనాలకే ఉపయోగించేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనాలు జరిగే ప్రాంతాలలో ముందుగానే ఏర్పాట్లు చేయాలన్నారు. కరెంటు తీగెలను సరి చేయాలి : ఎం ప్రభాకర్ రెడ్డి, శివరాంపల్లి శివరాంపల్లి పెద్ద వినాయకుడు ఊరేగింపుగా నిమజ్జనానికి వెళ్లడం జరుగుతుందని, కరెంటు తీగలను విద్యుత్ అధికారులు సరిచేయాలని ఆ బస్తీకి చెందిన ఎం ప్రభాకర్ రెడ్డి కోరారు . గత సంవత్సరం విద్యుత్ వైర్లు తగడం తగలడం వల్ల చాలా ఇబ్బందులు కలగాయన్నారు. గడచిన 18 సంవత్సరాలుగా ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ నాయకత్వంలో వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతున్నాయని రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు ఇంద్ర పాల్ రెడ్డి అన్నారు. ఈ సంవత్సరం కూడా అధికారులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు ఆలె భాస్కర్ రాజ్ , కార్యదర్శి కె మహేందర్, సెంట్రల్ కమిటీ సభ్యులు ఎన్ మల్లారెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్, రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, రాజేంద్రనగర్ జోనల్ ఎస్ ఈ నరేందర్ గౌడ్, రాజేంద్రనగర్ విద్యుత్ డీఈ రత్నాకర్ రావు, రాజేంద్రనగర్ , అత్తాపూర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ లు బి సురేందర్ రెడ్డి, మల్లారెడ్డి, జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ జోహార్ అలీ, జీహెచ్ ఎంసీ ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన సత్య నారాయణ రెడ్డి, నాయకులు ఎన్ ధనుంజయ, జోగి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎం ఆర్ కె చౌదరి దివ్య వివాహ వార్షికోత్సవ వేడుకలు

- **పాల్గొన్న ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్, సభ్యులు**



**మియాపూర్ , జులై30, నేటి శుభోదయ :** మియాపూర్ ప్రగతి ఎంక్లేవ్ లో నివాసం ఉంటున్న ప్రసాద్స్ ఫౌండేషన్ సభ్యులు ఎం ఆర్ కె చౌదరి శ్రీమతి దివ్య పెళ్లిరోజు సందర్భంగా ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్, టీం సభ్యులు వారి నివాసం లోమర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో ప్రసాద్స్ ఫౌండేషన్ టీమ్ సభ్యులు మరియు స్థానిక నాయకులు భాష, రాంబాబు, మూర్తి, శేఖర్ నాయుడు, వెంకట్రావు, ప్రసాద్, దోప్పలపూడి వినోద్ చౌదరి, శ్రీను, శ్రీకాంత్, పెద్దబాబు, సుదులగుంట్ల ప్రసాద్, వరుణ్, తులసి, బాలు, మూర్తి, పాల్గొన్నారు. ప్రసాద్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ కేక్ కట్ చేయించి సాంప్రదాయ శాలువాతో ఆయనను సత్కరించడం జరిగింది.

## దేవరకొండలో SIR ప్రక్రియపై ఎమ్మెల్యే బాలు నాయక్ సమీక్ష



**దిండి(గుండ్లపల్లి), జూలై 30, నేటి శుభోదయ :** దేవరకొండ నియోజకవర్గంలో అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కుకు దూరం కాకుండా చూడడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. గురువారం ఆయన నివాసంలో SIR (Special Intensive Revision) ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు.నియోజకవర్గంలోని 326 బూత్‌ల పరిధిలో అర్హులైన ఓటర్ల నమోదు ప్రక్రియను వేగంగా పూర్తి చేసిన BLAలు, BLOలు, కాంగ్రెస్ నాయకులు, బూత్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలను ఎమ్మెల్యే అభినందించారు. ఇంకా నమోదు కాని అర్హులైన ఓటర్లను గుర్తించి వెంటనే నమోదు పూర్తి చేయాలని సూచించారు.సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ, దేవరకొండలో SIR ప్రక్రియ విజయవంతంగా సాగడంలో ఎమ్మెల్యే నాయకత్వం, పార్టీ శ్రేణుల సమన్వయం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్వేనెం.193, మణికొండ మైసమ్మకుంట శికం భూమిపై అక్రమ ఆర్ఎంసీ ప్లాంట్

### - తక్షణ చర్యలు తీసుకోవాలి

**రాజేంద్ర నగర్, జూలై 30, నేటి శుభోదయ :** రెవెన్యూ రికార్డుల ప్రకారం మణికొండ సర్వే నెం.193లోని మైసమ్మకుంట శికం (చెరువు) భూమిపై దివ్యశ్రీ కన్స్ట్రక్షన్స్ సంస్థ రెడీ మిక్స్ కాంక్రీట్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు సమాచారం.ఇది కేవలం ప్రభుత్వ భూమి ఆక్రమణ మాత్రమే కాకుండా,పర్యావరణ పరిరక్షణ,వాయు కాలుష్యం,శబ్ద కాలుష్యం,భూగర్భ జలాల కాలుష్యం,చెరువు పరిరక్షణకు సంబంధించిన అత్యంత తీవ్రమైన అంశం.శికం భూమిలో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహించడం రెవెన్యూ,పర్యావరణ,కాలుష్య నియంత్రణ నిబంధనలకు విరుద్ధమైతే,అలాంటి ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆర్ఎంసీ ప్లాంట్ ఏర్పాటుకు ఎలా అనుమతులు ఇచ్చిందనే ప్రశ్నకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.అందువల్ల రెవెన్యూ, ఇరిగేషన్,మున్సిపల్ మరియు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సంయుక్తంగా తక్షణమే స్థల పరిశీలన నిర్వహించి,శికం భూమిపై ఆక్రమణ జరిగిందా,ఆర్ఎంసీ ప్లాంట్ చట్టబద్ధంగా ఏర్పాటు చేయబడిందా అనే అంశాలను నిర్ధారించాలి.ఉల్లంఘనలు నిరారణ అయితే,ఆర్ఎంసీ ప్లాంట్‌ను వెంటనే సీజ్ చేసి తొలగించడంతో పాటు,ఆక్రమిత శికం భూమిని పునరుద్ధరించి,బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.అదేవిధంగా,తెలంగాణ విజిలెన్స్ శాఖ,అవినీతి నిరోధక శాఖ ఈ వ్యవహారంలో రెవెన్యూ,కాలుష్య నియంత్రణ మండలి అధికారుల పాత్రను కూడా సమగ్రంగా విచారించాలి.ప్రజల నీటి వనరులను,చెరువులను పరిరక్షించడం ప్రభుత్వ యంత్రాంగం యొక్క రాజ్యాంగబద్ధమైన బాధ్యత తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.







Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620